# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం, 18 జనవరి 2025 సంపుటి: 9 సంచిక: 24 పేజీలు: 12 వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## నేడు గ్రూప్ 2 ప్రాథమిక కీ విడుదల




2

## శ్రీవారి అర్జిత సేవా టిక్కెట్లు



ఏప్రిల్ నెల కోటా 10 గంటలకు విడుదల 2



# విశాఖ ఉక్కుకు ఊపిరి



### రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన కేంద్రం

### చంద్రబాబు కృషి ఫలితమే ఈ సాయం

ఢిల్లీః విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరిపోసింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు స్టీల్ ప్లాంటుకు ఆర్థిక ప్యాకేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజ్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. దీనికి గాను ప్రధాని మోడీకి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

**రామ్మోహన్ ట్వీట్...**

"విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా రివైవల్ ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు

...మిగతా 2లో

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అరుదైన గౌరవం



2



సీఎం సింగపూర్ టూర్



# ఫస్ట్ డే.. ఫస్ట్ అగ్రిమెంట్

### ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ కీలక ఒప్పందం

- ఆ దేశ విదేశాంగ మంత్రితో రేవంత్ భేటీ
- ముఖ్యమంత్రి వెంట తెలంగాణ రైజింగ్ టీమ్
- అభివృద్ధి ప్రణాళికలు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చ

హైదరాబాద్ 17, (మనం న్యూస్)ః సింగపూర్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ రైజింగ్ టీమ్ శుక్రవారం అక్కడి ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఐటీఈతో తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్

...మిగతా 2లో



## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

### 31 నుంచి పార్లమెంటు సమావేశాలు

హైదరాబాద్, మనం ప్రతినిధిః 2025 కేంద్ర బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి నిర్వహించనున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజునే ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించనున్నారు. అయితే, ఈ బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి.

...మిగతా 2లో




## సంచార్ సాథీ

### మోసపూరిత కాల్స్‌కు చెక్ పెట్టే మొబైల్ యాప్

ఢిల్లీః మోసపూరిత కాల్స్/ సందేశాలకు చెక్ పెట్టేందుకు టెలికాం శాఖ సంచార్ సాథీ పేరిట ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దీన్ని శుక్రవారం విడుదల

...మిగతా 2లో



## ఆఫ్‌లైన్‌లోనే నీట్ యూజీ

ఢిల్లీః వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నీట్-యూజీని ప్రస్తుతానికి ఆన్‌లైన్‌లో నిర్వహించకూడదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాదికి ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. కేంద్ర విద్య, వైద్యశాఖల మధ్య విస్తృత చర్చల అనంతరం ఈ

...మిగతా 2లో

# ఇచ్చేదాంక ఇడ్సిపెట్టం

### రైతుభరోసా 15 వేలు ఇవ్వాల్సిందే

- రాష్ట్రమంతా రైతు ధర్నాలు చేస్తం
- 100 శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం రాజీనామా చేస్తం
- షాబాద్ రైతు సభలో రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- రైతు సేవలో కేసీఆర్‌ను మించినోడే లేడు



2



# సబ్ ప్లాన్ నిధులతో సత్ఫలితాలు రాబట్టాలె

### శాఖల వారీగా ప్రతినెలా వివరాలు వెల్లడించాలె

### ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

హైదరాబాద్, జనవరి 17 (మనం న్యూస్)ః ప్రతీ శాఖలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు చట్టం ప్రకారం ఖర్చు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉన్న నిధులను సంపూర్ణ స్థాయిలో వినియోగించాలనీ, సబ్ ప్లాన్ చట్టం ప్రకారం చేస్తున్న వ్యయం ఆయా వర్గాల్లో ఆదాయం బాగా పెరిగేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 23న నిర్వహించబోయే సమావేశానికి రావాలని అధికారులకు సూచించారు. సబ్ ప్లాన్ చట్టం కోటా ప్రకారం ఇప్పటివరకు నిధులు ఖర్చు చేయని శాఖల అధికారులు రాబోయే రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. బడ్జెటేతర నిధులు ఖర్చు చేసే

...మిగతా 2లో

### కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ

# ఇజ్జత్ తీస్తున్నది

### బీఆర్ఎస్‌ది వడ్డీ మాఫీనే... కేటీఆర్‌ది దొంగ దీక్ష

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



హైదరాబాద్ 17, (మనం న్యూస్)ః గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది రుణ మాఫీ కాదనీ, కేవలం వడ్డీ మాఫీ మాత్రమేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తిగా రుణ మాఫీ చేసిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన సిఎల్పీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వడమే పూర్తిగా మర్చిపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశంలో ఏక్కడా లేని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామనీ, మేము దీక్ష చేస్తేనే కాంగ్రెస్

...మిగతా 2లో

### వారి బండారం

## బైట పడాలె

### రేవంత్, కేటీఆర్‌కు లైడిటెక్టర్ పెట్టాలె



హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇద్దరికీ లైడిటెక్టర్ పరీక్షలు చేస్తే వారి బండారం బయటపడుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారంనాడు ఢిల్లీలో అరవింద్ మీడియాతో

...మిగతా 2లో



9

### మద్దతు ధర కోసం

## మళ్లీ పోరాటం

'ఢిల్లీ చలో' పునఃప్రారంభం

21న పాదయాత్ర మొదలు






# గర్భిణులకు రూ.21వేలు

### హోలీ, దీపావళి పండుగలకు ఉచిత గ్యాస్ బండ

- రూ.500కు సిలిండర్.. అటల్ క్యాంటీన్లలో రూ. 5 భోజనం
- సంక్షేమ పథకాల అమల్లో వస్తున్న ఆరోపణలపై దర్యాప్తునకు హామీ
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన పార్టీ అధ్యక్షుడు నడ్డా



ఢిల్లీః ఇప్పటి వరకూ ఉచితాల జోలికి పెద్దగా పోని బీజేపీ ఢిల్లీ ఎన్నికల్లో 'ఉచిత' హామీలతో ప్రజలను ఊరిస్తోంది. ఏ ఎన్నికల్లోనైనా కాషాయ ఎజెండాతోనే బరిలోకి దిగుతున్న బీజేపీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించింది. 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో ఆ పార్టీ

...మిగతా 2లో

# ఫస్ట్ డే.. ఫస్ట్ అగ్రిమెంట్

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీని సందర్శించింది. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించింది. అక్కడ శిక్షణ అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. ఆ తరువాత యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ బృందం చర్చలు జరిపింది. హైదరాబాద్‌లోని ఫోర్త్ సిటీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసే స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలనీ, వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులను నిర్వహిస్తున్న తీరును మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పరం సహకరించుకోవాలన్న సీఎం ప్రతిపాదనకు ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. ఈమేరకు స్కిల్ వర్సిటీ వీసీ, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఒప్పందం కుదిరింది. అంతకు ముందు సింగపూర్ విదేశాంగ మంత్రి



వివియన్ బాలకృష్ణన్‌తో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభమైన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, మూసీ పునరుజ్జీవం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆ దేశంలోని అభివృద్ధి పనులతో పాటు తెలంగాణలోని ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. అలాగే సింగపూర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రాష్ట్రంలో జరుగుతున్న అంశాలను పోల్చి చూశారు. నిధుల సమీకరణపై సమాలోచనలు చేశారు. కాగా, సీఎం రేవంత్ నేతృత్వంలోని బృందం శని, ఆదివారాల్లో కూడా సింగపూర్‌లో పర్యటించనుంది. ఆ దేశంలోని పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులతో కూడా సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు. సింగపూర్ పర్యటన అనంతరం సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్ వెళ్లనుంది. అక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఈ వేదికపై వివరించనున్నారు. గతంలో సుమారు రూ.40 వేల కోట్లు తీసుకువచ్చిన నేపథ్యంలో ఈసారి మరింత ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించాలనే యోచనలో ఉన్నారు. సింగపూర్‌లోని ప్రవాస భారతీయులలో హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ఫోకస్ చేయడంతో పాటు కొత్తగా తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని వివరించనున్నారు.

# విశాఖ ఉక్కుకు ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

ఈసాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం'' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు.

**చంద్రబాబు ప్రత్యేక ఫోకస్..**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఢిల్లీకి వెళ్లిన ప్రతీసారీ ప్రధాని మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కుశాఖ మంత్రి కుమార స్వామితో సమావేశమై స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ కోసం చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఇటీవల ప్రధాన మంత్రిని కలిసినప్పుడు కూడా విశాఖ ఉక్కు పరిశ్రమకు అవసరమైన ఆర్థిక సహాయం కావాలని చంద్రబాబు కోరారు. దీనిపై విభిన్నకోణాల్లో చర్చలు జరిపిన తర్వాత కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీని ఆమోదించింది. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాం 2023-24లో రూ. 4548.86 కోట్లు, అలాగే 2022-23లో రూ.2858.74 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఈ క్రమంలో వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడంతో ఈ పరిశ్రమకు నష్టాలు వెంటాడాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్ ప్లాంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడం, సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్రకటనతో ముందడుగు పడినట్లైంది. ఈ ప్రకటనతో స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి ప్రైవేటీకరణ అంశం వెనక్కి వెళ్లిందని చెప్పుకోవచ్చు. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# గర్భిణులకు రూ.21వేలు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ హామీల పత్రాన్ని ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను రూ.500కే ఇస్తామని పేర్కొన్నారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. వీటితోపాటు ప్రస్తుతం ఉన్న అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

ఆరు పౌష్టికాహార కిట్లు. ప్రస్తుతం ఇస్తున్న మొదటి సంతానం సమయంలో రూ5వేలు, రెండో సంతానానికి రూ.6వేలకు ఈ రూ. 21 వేలు అదనం అంటూ నడ్డా స్పష్టం చేశారు. ఆయుష్మాన్ భారత్‌ను ఢిల్లీలో అమలు చేస్తామని, దీనిలో భాగంగా రూ.5లక్షల ఆరోగ్య కవరేజీ ఇవ్వనున్నట్టు చెప్పారు.

పేద కుటుంబీలకు రూ.500లకే ఎల్పీజీ సిలిండర్‌తో పాటు ప్రతి హోలీ, దీపావళి (ఒకటి చొప్పున) పండగల సమయంలో ఉచితంగా గ్యాస్ సిలిండర్, 60-70ఏళ్ల వయోవృద్ధులకు రూ.2500 పెన్షన్, 70ఏళ్ల పైబడిన వారికి రూ.3000 జేజే క్లస్టర్లలో అటల్ క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా రూ.5కే భోజనం వంటివి సరఫరా చేయనున్నట్టు నడ్డా మేనిఫెస్టోలో పెట్టినట్టు తెలిపారు. వీటన్నిటికీ మించి సంక్షేమ పథకాల అమల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేస్తామని కూడా ఆయన వెల్లడించారు.

## నేడు గ్రూప్ 2 ప్రాథమిక కీ విడుదల




**హైదరాబాద్:** గ్రూప్-2 ప్రాథమిక కీని నేడు విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 18 నుంచి 22 వరకు అభ్యర్థుల లాగిన్లో ప్రాథమిక కీ అభ్యంతరాలను స్వీకరిస్తారు. రాష్ట్రంలో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ పరీక్షలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 1368 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి.

# కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ఇజ్జత్ తీస్తున్నది

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం రైతు భరోసా ఇస్తున్నదని చెప్పడానికే బీఆర్ఎస్ రైతు దీక్ష పేరుతో నాటకం ఆడుతున్నదని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద రైతులను ఆదుకునేందుకు ఈనెల 26 నుంచి ఎకరాకు రూ.12 వేలు ఇస్తుందనీ, అదే విధంగా వ్యవసాయ యోగ్యమైన భూమి ఉండి, సాగులో లేని భూమికి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ రైతు బంధు పేరుతో ఏడాదికి రూ.8 వేల నుంచి 10 వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దానికి బదులుగా రూ.12 వేలు ఇస్తున్నదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి తెలిపారు.

**కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదు : కడియం**

ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ ఇచ్చిపుచ్చుకునే విధంగా వ్యవహరించాడని కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. రూ.40 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లుగా అధారాలు ఉన్నాయని చెప్పారు. బాండ్ల రూపంలో కేటీఆర్‌కు రూ.40 కోట్లు తిరిగి వచ్చాయన్నారు. ఈ కేసు లొట్టపీసు కేస్ అయితే, ఈడీ కేటీఆర్‌ను ఎందుకు విచారణకు ఎంక్వైరీకి పిలుస్తుందని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు కేటీఆర్ పిటిషన్‌ను ఎందుకు తిరస్కరించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా కేటీఆర్ అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నాడనీ, కల్వకుంట్ల కుటుంబం జైలు పాలవుతూ తెలంగాణ పరువు తీస్తున్నదని విమర్శించారు.

# సబ్ ప్లాన్ నిధులతో సత్ఫలితాలు రాబట్టాలె

(మొదటి పేజీ తరువాయి)

సయమంలో జనాభా దామాషా ప్రకారం నిధుల ఖర్చు జరిగిందా లేదా అందుకు సంబంధించిన సంపూర్ణ సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. అమలుకు సంబంధించి గత 8 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసిన సెస్ నివేదికను సమావేశాలు సంబంధిత అధికారులు ప్రదర్శించారు. ఇక నుంచి సెస్ అధికారులు తమ నివేదికలను ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ అధికారులకు అందజేసి వారితో తరచూ సమావేశం కావాలని ఆదేశించారు. అలాగే, ఆర్థిక సంవత్సరంలో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేసేందుకు వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలతో ఎస్సీ, ఎస్టీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు సమావేశమై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకి షోర్, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవారి అర్జిత్ సేవా టిక్కెట్లు

**తిరుమల, జనవరి 17 (మనం న్యూస్):** శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి ఏపీఆర్ నెల కోటాను టీటీడీ శనివారం ఉదయం విడుదల చేయనుంది. ఈ టికెట్ల కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో ఎంపికైన వారికి టికెట్ల కేటాయింపు జరుగనుంది. అలాగే కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను ఈనెల 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. రూ.300 టికెట్లు ఈనెల 24వ తేదీన విడుదల కానున్నాయి.

వృద్ధులు, వికలాంగులకు కల్పించే ప్రత్యేక ప్రవేశ దర్శనం ఆన్ లైన్ కోటాను జనవరి 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. అలాగే జనవరి 24న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం ఏప్రిల్ నెల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఏప్రిల్ నెలకు సంబంధించి గదుల కోటాను ఇదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్లైన్లో విడుదల చేయనున్నట్లు టీటీడీ ప్రకటనలో తెలిపింది.

## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న 2025-26 వార్షిక బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఇక, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి.

## ఆఫ్‌లైన్‌లోనే నీట్ యూజీ

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 'జాతీయ వైద్య కమిషన్ నిర్ణయం ప్రకారం.. నీట్-యూజీని పెన్ను, పేపరు విధానంలో ఓఎమ్మార్ షీట్లతో ఒకే రోజు.. ఒకే షిఫ్టులో నిర్వహించనున్నాం' అని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) ప్రకటించింది. గత ఏడాది ఎన్టీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీతో తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో వాటిని సంస్కరించేందుకు ఇస్రో మాజీ ఛైర్మన్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇచ్చిన పలు సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఆఫ్‌లైన్ వైపు ప్రభుత్వం మొగ్గుచూపింది.

## సంచార్ సాథీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అనుమానిత కాల్స్ వచ్చినపుడు మొబైల్ ఫోన్ లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేయడం, మొబైల్ ఫోన్ బ్లాక్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. తొలుత సంచార్ సాథీ పోర్టల్‌ను 2023లో కేంద్ర టెలికాం శాఖ అందుబాటులోకి తెచ్చింది. మొబైల్ యాప్‌ను లాంచ్ చేయడం ద్వారా మరింత సమర్థంగా మోసాలకు చెక్ పెట్టొచ్చని కేంద్రం భావిస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్లో ఈ యాప్ వినియోగించొచ్చు.

**యాప్ ఫీచర్లు ఇవే..**

అనుమానిత కాల్స్/ ఎస్ఎమ్మెస్‌లు వచ్చినప్పుడు కాల్ లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ పేరు మీద అనధికారికంగా ఏవైనా నంబర్లు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు. మొబైల్ పోయినప్పుడు, దొంగతనానికి గురైనప్పుడు బ్లాక్ చేసే సదుపాయం కూడా దీనిలో ఉంది.




# ఇచ్చేదాంక ఇడ్సిపెట్టం



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క ఊరిలోనైనా వంద శాతం రుణమాఫీ అయిందని నిరూపిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా ముకుమ్మడిగా రాజీనామా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఏర్పాటు చేసిన రైతు సభకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వలేదు. అందుకే ఇవాళ ధర్నా పెట్టాం. ఇది ప్రారంభం మాత్రమే.. రాష్ట్రమంతా ధర్నాలు పెడుతాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా 15 వేలు ఇవ్వాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వానాకాలం రైతుబంధును ఎగ్గొట్టిండు.. దాన్ని కూడా విడిచి పెట్టొద్దు అని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలోని మహిళలకు కాంగ్రెసోళ్లను నమ్మకండి అని కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి ఈ ఏడాది 30 వేలు బాకీ ఉన్నాడు. ఓట్లు అడిగితే 30 వేలు చెల్లించి ఓట్లు అడగండి అని కాంగ్రెసోళ్లకు చెప్పండి. రేపు తప్పిదారి.. 12 వేలు ఇస్తుండుగా అని ఓట్లు వేస్తే.. మళ్లీ ఇవ్వడు. ఓట్లప్పుడు మాత్రమే పైసలు ఇస్తడు.. సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు. ఇక, ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపోడు నిన్ను నమ్మడం లేదా..? పెళ్లైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు.

**రైతు సేవలో కేసీఆర్‌ను మించినోడే లేడు..**

రైతులకు, వ్యవసాయానికి కేసీఆర్ చేసినంత సేవ దేశ చరిత్రలో ఎవరూ చేయలేదు. రైతుబంధు, రైతు బీమా, రైతు వేదికలు, సాగునీరు వంటి అనేక విప్లవాత్మక కార్యక్రమాలను కేసీఆర్ తీసుకువచ్చారు అని కేటీఆర్ గుర్తు చేశారు. మా పార్టీకి ఆయువు పట్టుగా ఉన్న రైతన్నల కోసం నిరంతరం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకు వస్తూనే ఉంటాము. విచారణల పేరుతో ఎంత డైవర్షన్లు చేసినా మా పోరాటం ఆపబోమని కేటీఆర్ తెల్చిచెప్పారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేయడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల కోసమే రైతు భరోసాను రేవంత్ రెడ్డి తెరపైకి తీసుకువస్తున్నాడని కేటీఆర్ తెలిపారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

**కూట్ల రాయి తీయలేనోడు.. ఏట్ల రాయి ఎట్ల తీస్తడు?**

ఇవాళ పేపర్లలో బెస్ట్ జోక్ చూసినా.. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయిండు.. అక్కడ స్పీచ్ ఇస్తుండు.. తెలంగాణలో మొత్తం ఉద్ధరించిన.. ఢిల్లీలో కూడా ఎదో ఉద్ధరిస్తానంటూ బయలుదేరిండు. మీరు నా మాట నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వండి. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశాం.. రుణమాఫీ చేశాను. 100 రోజుల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా.. ఢిల్లీలో కూడా అదే చేస్తానని రేవంత్ రెడ్డి చెబుతున్నాడు. అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా..? కూట్లో రాయి తీయనోడు.. ఏట్లో రాయి తీస్తాడా..? సీఎం అబద్ధాలు చెప్పొచ్చునా..? ఆరు గ్యారెంటీలలో అర గ్యారెంటీ అమలైంది.. అది కూడా ఫ్రీ బస్సు. మా ఊరికి బస్సే దిక్కు లేదు అని కొందరు లొల్లి పెడుతున్నరు. మీరు తిట్టే తిట్లకు రోషమున్నడు అయితే బకెట్లో నీళ్లు నింపుకుని దాంట్లో దూకి చచ్చిపోతాడు. కానీ ఆయన రేవంత్ రెడ్డి.. ఆయనకు రోషం, సిగ్గు లేదు. అబ్బదాలు చెప్పడు ఆయనకు అలవాటు. ఒక్క మాట అడుగుతున్నా.. ఊర్లల్లో ఒక మాటిస్తే, బాకీ ఇస్తే తిరిగి ఇవ్వకపోతే కేసు పెడుతాం.. 420 కేసు పెడుతాం.. చీటింగ్ చేసిండు అని.

## వారి బండారం బైట పడాలె

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ... వారిద్దరికీ లైడిటెక్టర్ పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. ఓటుకు నోటు కేసు సమయంలో నోట్ల కట్టలు తీసుకువెళ్లమని రేవంత్ రెడ్డికి, ఈ-రేసింగ్ కేసులో ఫెమా నిబంధనలు ఉల్లంఘించాలని కేటీఆర్‌కు ఎవరు చెప్పారో తెలియాలన్నారు. తెలంగాణలో హామీలు, మోసాలపై ప్రజలకు తాము వివరిస్తామన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ కూడా భారీ అవినీతికి పాల్పడ్డారని, తెలంగాణ నేతలను కూడా ఢిల్లీకి తీసుకువచ్చి మరీ లిక్కర్ స్కామ్‌లో అక్రమాలు చేశారని అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అరుదైన గౌరవం

**హైదరాబాద్ 17, (మనం న్యూస్):** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్(డబ్ల్యూఎంఎఫ్) జాబితాలో చోటు దక్కింది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అవశ్యకతను డబ్ల్యూఎంఎఫ్ గుర్తించింది. మూసీని ప్రక్షాళన చేయకపోతే ఉస్మానియా ఆస్పత్రి, హైకోర్టు, సెంట్రల్ లైబ్రరీ, సిటీ కాలేజీ, మహిళా యూనివర్సిటీ, ఇతర చారిత్రక కట్టడాలకు మూసీకాలుష్యంతో ముప్పు పొంచి ఉందని పేర్కొంది.

# ఇది ఆలీబాబా అరడజన్ దొంగల పాలన

- **వసూళ్లు, బ్లాక్‌మెయిల్, భూ దందాలే వారి లక్ష్యం**
- **రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు**
- **రాహుల్ గాంధీ చేస్తే ఒప్పు.. మేము చేస్తే తప్పా?**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణలో రేవంత్ రెడ్డి పరిపాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన దోపిడీ ముఠా రాష్ట్రంలో తిరుగుతుందన్నారు. రేవంత్ సోదరులతో పాటు ఆరుగురు సభ్యులతో కూడిన ఓ టీమ్‌ను కంపెనీల్లో వసూళ్ల కోసం రేవంత్ రెడ్డి తిప్పుతున్నాడని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిరెడ్డి, కొండల్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, రోనిన్ రెడ్డి, ఫహీం ఖురేషి, ఏవి రెడ్డి.. ఆరుగురితో కూడిన ఆలీబాబా అర డజన్ దొంగల గ్యాంగ్ తెలంగాణ రాష్ట్రంలో తిరుగుతుంది. ఈ ముఠా కంపెనీలను బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ వసూళ్లకు తెగబడుతున్నది. వీరు కబ్జాలతో పాటు, భూ దందాలను చేస్తున్నారు. వీరి వసూళ్లను, బ్లాక్‌మెయిల్‌ని, భూ దందాలను పక్కదారి పట్టించడం కోసమే అనేక అంశాలను కాంగ్రెస్ అనవసరంగా తెరమీదకి తీసుకువస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

కొన్ని రోజులు కాళేశ్వరం, కొన్ని రోజులు ఫోన్ టాపింగ్.. ఇలా ఈ రాష్ట్ర ప్రభుత్వం టైం పాస్ చేస్తుంది. మేము గతంలో చేసిన పెట్టుబడి ప్రయత్నం ఫలితంగానే ఈరోజు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. కానీ 40 వేల కోట్ల రూపాయల ప్రకటనలు చేసిన రేవంత్ రెడ్డి.. పెట్టుబడులు ఏవి కూడా తెలంగాణకు రాలేదు అని కేటీఆర్ తెలిపారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇయ్యకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోతే ఊరుకోము. బడుగు బలహీన వర్గాల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాలలో జరుగుతున్న అంశాలపైన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాల పైన దృష్టి సారిస్తే మంచిది.

## కృష్ణా నీటి వాటాల పాపం భారాసదే: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జనవరి 17 (మనం న్యూస్):** కృష్ణా నదీ జలాల వాటాల పాపం భారాసదేనని, పదేళ్ల పాటు తెలంగాణకు తీరని ద్రోహం చేశారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కృష్ణా జలాలను పదేళ్లుగా పట్టించుకోని భారాస నేతలు ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఆక్షేపించారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీలు వాడుకునేలా ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టిందని విమర్శించారు. భారాస ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందంతోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్న ఆయన.. తాత్కాలిక కేటాయింపులపై ప్రతి ఏడాది సంతకాలు చేసింది భారాస నేతలు కాదా? అని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం వాటా రావాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వం అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు దక్కాల్సిన వాటా విషయంలో భారాస ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ (3) అంశం తెరపైకి వచ్చిందన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇండ్లు

- **రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, జనవరి 17 (మనం న్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అనీ, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్న వారికి రెండో విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్న వారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామ సభల్లో పెట్టాలన్నారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామనీ, ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజినీర్లు మాత్రమే ఉన్నారనీ, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజినీర్లు అవసరం అవుతారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇతర ప్రభుత్వ విభాగాలలోని ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా వినియోగించుకోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని మంత్రి సీఎస్‌కు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిచాలని అధికారులకు సూచించారు. అలాగే, విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామనీ, ఇందుకోసం వీఆర్వో, వీఆర్ఏ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలనీ, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను సైతం తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



# అర్హులైన ప్రతి నిరుపేదకు పథకాలు అందాలి

- జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె. శశాంక

కాప్రా, జనవరి 17(మనంన్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేదకు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పని చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక అన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్ పేట తహసీల్దారు కార్యాలయంలో సంక్షేమ పథకాల పై జిల్లా కలెక్టరు గౌతంతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శంశాంక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబరు ప్రకారం వ్యవసాయయోగ్యమైనదా, కాదా అనే స్పష్టతను గుర్తించి నివేదికలను తయారు చేయాలని సూచించారు. ఫైనల్ గా తహసీల్దారు సమగ్ర నివేదికను పరిశీలించాలని తెలిపారు. గుట్టలు,రాళ్లు, లే అవుట్లు, కాలేజీలు,గోడౌన్లు, పౌల్ట్రీ, ఇటిక బట్టిలు వంటి వాటిన వ్యవసాయేతరంగా చూపించాలన్నారు. గ్రామస్థాయిలో గ్రామ సభలు, మున్సిపాలిటీల స్థాయిలో వార్డు సభలను పక్కాగా నిర్వహించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులన్నీ క్రోడీకరించుకోవడంతో పాటు గ్రామాల మ్యాపులను పరిశీలించాలన్నారు. ఈ యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని, ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతనే వెల్లడించాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 నగదు సాయం అందించనున్న నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తిచేసుకున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం




వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని, ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపిడిఓ ఉంటారని, ఎంపిడిఓలు, ఎంపిఓలు సమన్వయంతో పనిచేయాలని, అలాగే ప్రతి గ్రామ సభల్లో ఈ జాబితాను ప్రచురించాలని, చదివి వినిపించాలని, ఎలాంటి అపోహలు తలెత్తకుండా గ్రామ సభల్లో చర్చించి, ఆమోదించడం జరుగుతుందని సూచించారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు గ్రామ సభల్లో వస్తే, వాటిని స్వీకరించి, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు) పథకంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారని, అలాగే భూములు, ఆదాయం తదితర అంశాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు.

అందుకు సంబంధించిన ఫీల్ వెరిఫికేషన్ ఫార్మ్ లో కుటుంబాల సమగ్ర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసి, ఈ ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతే అమోదించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఒక రేషన్ కార్డు ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలన్నారు. గ్రామీణంలో వార్షిక ఆదాయం రూ. 1.50 ఉండాలని, అర్బన్ లో రూ. రెండు లక్షలుగా ఉండాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గృహాలు, ఇళ్లు లేనివారు, పూరిగుడిసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు, నిర్మాణానికి స్థలం ఉన్నవారు అర్హులను తెలిపారు. ఇందులో భాగంగా మట్టి గోడలు, పైకప్పు లేని గృహాలు, వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్ లాగిన్ లలో ఎటువంటి లోపాలు దొర్లకుండా సూపర్ చెక్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు కేటాయించేందుకు గాను ఏఐ, జియో ట్యాగింగ్ ద్వారా డీడూప్లికేషన్ చేయాలని సూచించారు. అలాగే ఏమైనా పొరపాట్లు ఉంటే పీడీ హౌసింగ్ కు పంపించాలని, వివరాలను సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ కల్పించినట్లు వివరించారు.ఈ మొత్తం సంక్షేమ పథకాల ప్రక్రియలు మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 12243 రేషన్ కార్డుల దరఖాస్తులు ఉన్నాయని జిల్లా కలెక్టరు గౌతం స్పెషల్ అధికారికి వివరించారు. అనంతరం శామీర్ పేట మండలంలోని ఆలియాబాదులో స్పెషల్ ఆఫీసర్ శశాంక ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారు పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి తూంకుంటకు వెళ్లి అక్కడ నిర్వహిస్తున్నరేషన్ కార్డుల సర్వేను పరిశీలించి సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి,శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరి, డిఆర్ డిఓ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరా అధికారి సుగుణబాయి, హౌజింగ్ పిడి రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్, ఎంపిడిఓ సుగుణ బాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యం

- కెఎల్ డీమ్డ్ టు బి యూనవిర్సిటీ వైస్ చాన్సలర్

బంజారాహిల్స్, జనవరి 17(మనం న్యూస్): ఆవిష్కరణల సంస్క ృతిని పెంపొందించడమే లక్ష్యంగా విద్యార్థుల కోసం




కార్యశాలలు,నాయకత్వ అభివృద్ధి సెషన్లను నిర్వహిస్తున్నామని కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి అన్నారు.ఇటీవల తమ బాచుపల్లి క్యాంపస్ లో నిర్వహించిన కార్యక్రమాల గురించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడం,వారి చదువుకు సంబంధించిన రంగాల్లో ఆవిష్కర్తలుగా,నాయకులుగా మారడానికి సంసిద్ధం చేయడం కోసం అన్ని అవకాశాలను కల్పిస్తున్నామన్నారు.నేటి శక్తివంతమైన ప్రొఫెషనల్ ప్రపంచంలో రాణించడానికి అవసరమైన కీలకమైన నైపుణ్యాలు,జ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి తాము రూపొందించిన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం,రోబోట్రానిక్స్ క్లబ్తో కలిసి,తరగతి గది సిద్ధాంతం,పరిశ్రమ అభ్యాసం మధ్య అంతరాన్ని తగ్గించడానికి దృష్టి సారించిందన్నారు.డ్రోన్ ప్రోటోటైపింగ్ కార్యశాల నిర్వహించిందన్నారు.ఈ కార్యక్రమంలో ఈపీఐటీ రీసెర్చ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు,సీఈఓ వడ్లూరి వరుణ్ కీలకోపన్యాసం చేశారని వెల్లడించారు.నాయకత్వం,కెరీర్ సంసిద్ధతపై దృష్టి సారించిన మరో కార్యక్రమంలో,'షేపింగ్ టుమారోస్ లీడర్స్ ఇండస్ట్రీ ఇన్సైట్స్ ఫర్ స్టూడెంట్స్' అనే సెషన్ను క్యాంపస్ నిర్వహించిందన్నారు. ఈ స్ఫూర్తిదాయకమైన కార్యక్రమంలో స్టేట్ స్ట్రీట్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ పోంక్షే మాట్లాడి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారని వెల్లడించారు.అదే సమయంలో యూనివర్సిటీ ఏసీఎం స్టూడెంట్ చాప్టర్ 'సస్టైనబుల్ ఏఐ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్' అనే ముఖ్యమైన సెషన్ను నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎన్వీడియా సీనియర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ రామ గోవిందరాజు స్థిరత్వాన్ని పెంపొందించడంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్రపై విద్యార్థులతో చర్చించారన్నారు."

ఎరుగుతున్న పోటీ,సాంకేతికత ఆధారిత ప్రపంచం సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయడానికి కెఎల్హెచ్ బాచుపల్లి క్యాంపస్ ఆచరణాత్మక అభ్యాసం,పరిశ్రమ నిపుణులతో పరిచయం, నాయకత్వ శిక్షణకు ప్రాధాన్యతనిస్తూనే ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని బాచుపల్లి క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ కోటేశ్వరరావు,అధ్యాపకులు,సిబ్బంది చురుకుగా ప్రోత్సహిస్తున్నారని తెలియజేశారు. ఆవిష్కరణ, సహకారం, వ్యక్తిగత వృద్ధికి బలమైన వేదికలను అందించడం ద్వారా, క్యాంపస్ విద్యార్థులకు మరింత స్థిరమైన భవిష్యత్తును చురుకుగా రూపొందిస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి




- క్రీడలతో మానసిక ప్రశాంతత
- మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి, జనవరి 17(మనంన్యూస్): యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపురం, చెన్నంపల్లి, మాదయి పల్లి గ్రామాలలో నిర్వహించిన క్రికెట్ టౌర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. చెన్నంపల్లి,వెంకటాపూర్ గ్రామ క్రీడాకారులకు మొదటి బహుమతి 10,000 వేల రూపాయల నగదు మాదయి పల్లి క్రీడాకారులకు 5,000 వేల రూపాయల నగదును శ్రీనివాస్ యాదవ్₹ అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని భవిష్యత్తు లో ఉన్నత స్థాయి కి ఎదిగి తల్లి తండ్రులకు పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకరావలని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మూజీబూర్ రహేమాన్ ఏఎంసి, డైరెక్టర్ వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్,మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఉప్ప సర్పంచ్ అజీజ్, నాయకులు శేఖర్ రెడ్డి, గెలవలెయ్య, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,శేఖర్,అంజన్ రెడ్డి,భాస్కర్,అంజయ్య,వెంకట్ రాములు, ఆంజనేయులు, యాదయ్య, రాఘవేందర్, మాధవులు, రమేష్, శ్రీకాంత్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 17న అంతర్జాతీయ దేవాలయాల సదస్సు

- ఐటీసీఎక్స్ వ్యవస్థాపకుడు గిరీశ్ కులకర్ణి

పంజాగుట్ట,జనవరి 17(మనం న్యూస్): పవిత్రమైన తిరుపతి నగరంలో ఫిబ్రవరి 17 నుంచి




19 వరకు అంతర్జాతీయ దేవాలయాల సదస్సు (ఐటీసీఎక్స్) రెండో ఎడిషన్ నిర్వహించనున్నట్లు ఐటీసీఎక్స్,టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరీశ్ కులకర్ణి ప్రకటించారు.ఈ విషయమై శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో తొలి ఎడిషన్ ను నిర్వహించామన్నారు.ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సదస్సును అభినందించారని గుర్తు చేశారు.ఈ ఏడాది జరిగే సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మద్దతు లభించిందన్నారు.ఆలయ నిర్వహణలో మార్పును తీసుకురావడం,భక్తులకు ఆధ్యాత్మిక అనుభవాలను పెంచడం తమ లక్ష్యమన్నారు.అందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న వందలాది దేవాలయాల ప్రతినిధులను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.ఈ ఏడాది 58 దేశాల నుంచి 1,580 కంటే ఎక్కువ దేవాలయాల ప్రతినిధులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐటీసీఎక్స్ సదస్సుకు హాజరవుతారన్నారు.ఇందులో పాల్గొనే ఆలయ ప్రతినిధులు జనవరి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని వెల్లడించారు.సదస్సులో భాగంగా భోజనం, వసతి కల్పిస్తారన్నారు.దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు తగిన నిర్వహణ,అత్యాధునిక సాంకేతికత ద్వారా భద్రతపరమైన చర్యలు, విపత్తుల నిర్వహణ వంటి అంశాలపై సదస్సులో చర్చ జరుగుతుందని గిరీశ్ వివరించారు.మూడు రోజుల పాటు జరిగే ఐటీసీఎక్స్ లో నెట్వర్కింగ్,జ్ఞాన భాగస్వామ్యం,సహకార అభ్యాసం కోసం ఒక సమగ్ర వేదికను ఏర్పరచడానికి మరియు పెంపొందించడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు.111 మంది నిపుణులైన వక్తలను కలిగి ఉన్న ఈ కార్యక్రమంలో సెమినార్లు,ఇంటరాక్టివ్ వర్క్షాప్లు,ప్రత్యేక మాస్టర్క్లాస్లు -టెంపుల్ టాక్స్ స్టేజ్ అన్నీ ప్రపంచ భాగస్వామ్యం కోసం హైబ్రిడ్ ఫార్మాట్లో జరుగుతాయని వెల్లడించారు.ఈ సమావేశంలో మహారాష్ట్ర ఎంఎల్సీ, ఐటీసీఎక్స్ 2025 చైర్మన్ ప్రసాద్ లాడ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్లో భారీగా డ్రగ్స్ పట్టివేత

- 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్, స్వాధీనం
- 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్..
- రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు

కాప్రా, జనవరి 17 (మనం న్యూస్): హైదరాబాద్, నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు.




నిందితులు రాజస్థాన్కు చెందిన మహేష్, మహిపాల్ గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్కు చెందిన వారైనా నేరేడ్మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో డిఫరెంట్ మెథడ్స్ వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. వోలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు.

పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలల్లోకి వెళ్లి యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిన్న జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తమ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కూడా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారని సీపీ సుధీర్ బాబు తెలిపారు.

# గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్గా మల్లేష్ ముదిరాజ్

రంగారెడ్డి, జనవరి 17 (మనం న్యూస్): గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మల్లేష్ ముదిరాజ్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలవర్గం ప్రమాణ ఉత్సవంలో ముఖ్య అతిథులుగా




స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి లు హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ గా కావలి చంద్రశేఖర్, డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేశారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 26 నుండి రైతులందరికీ రైతు భరోసా ఎకరాకు 6000 అందించనున్నాం అని ఇందిరమ్మ ఇళ్లు, అర్హులందరికీ రేషన్ కార్డులు అందించబోతున్నాం అని అన్నారు. ప్రభుత్వంపై భారం ఉన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, శ్రీహరి ముదిరాజ్, యాదయ్య, శంకర్, మాజీద్ హుస్సేన్, కౌసర్ మైనుద్దీన్ లు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

రంగారెడ్డి, జనవరి 17(మనం న్యూస్): జాతీయ రోడ్డు మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మలక్ పేట్ ఆర్టీవో కృష్ణయ్య ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కార్యక్రమాన్ని మలక్ పేట్ ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతోనిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం మొదలైన అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించని వాహనాదారులకు ఎర్ర గులాబీని ఇచ్చి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎం వి ఐలు రమేష్ బాబు, రాధిక, నరేంద్రపల్, బలరాం, ఏ ఎం వి ఐలు , మధుసూదన రెడ్డి, జాన్, అష్ఫాక్ అహ్మద్, పరిపాలనా అధికారులు, అంజుం, ప్రవీణ్,మధుకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# అంతరిక్షంలో భారత్ మరో విజయం



2024 డిసెంబర్ 30న ప్రారంభించిన స్పేస్ డాకింగ్ ఎక్స్పెరిమెంట్ (స్పేడెక్స్) మిషన్ను 2025 జనవరి 16న భారత్ విజయవంతంగా పూర్తి చేసి చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. దీంతో అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను కలిపే డాకింగ్ ప్రక్రియను చేపట్టగల అమెరికా, రష్యా, చైనాల తర్వాత దేశాల సరసన చేరింది. ఈ విజయంతో ప్రపంచంలో ఈ సాంకేతిక విజయాన్ని సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. 'డాకింగ్‌లో ఇస్రో చేపట్టిన స్పాడెక్స్ మిషన్ విజయం సాధించి చరిత్ర సృష్టించింది. ఈ క్షణాన్ని చూడటం మాకు గర్వంగా ఉంది'అని ఇస్రో పేర్కొంది. ఈ సాంకేతిక పురోగతి అంతరిక్ష రంగంలో భారతదేశ పురోగతిని నొక్కి చెప్పడమే కాకుండా మరింత సంక్లిష్టమైన మిషన్లకు కొత్త అవకాశాలను తెరుస్తుంది. ప్రపంచ అంతరిక్ష సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న దేశ స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

**డాకింగ్ అంటే :**
అంతరిక్షంలో 'డాకింగ్' అనే పదం రెండు అంతరిక్ష వస్తువులు (అంతరిక్ష నౌక లేదా ఉపగ్రహాలు వంటివి) కలిసి ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం చేరే ప్రక్రియను సూచిస్తుంది. సరళంగా చెప్పాలంటే రెండు అంతరిక్ష వాహనాలు స్వయంచాలకంగా కనెక్ట్ అయినప్పుడు స్పేస్ డాకింగ్ జరుగుతుంది. ఇది భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు కీలకం. ఈ మిషన్ భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. స్పేస్ డాకింగ్ టెక్నాలజీలో స్పాడెక్స్ భారత్‌ను గ్లోబల్ లీడర్ గా నిలబెడుతుంది.

**మిషన్ ప్రాముఖ్యత:**
అంతరిక్షంలో పెద్ద నిర్మాణాలను అసెంబ్లింగ్ చేయాల్సిన భవిష్యత్ స్పేస్ మిషన్లకు ఇది చాలా అవసరం. ఇందులో స్పేస్ స్టేషన్లను నిర్మించడం లేదా భారీ పేలోడ్ మిషన్లను నిర్వహించడం వంటివి ఉంటాయి. చంద్రుని అన్వేషణ, అంతరిక్ష కేంద్రాల నిర్వహణ వంటి రాబోయే అంతరిక్ష యాత్రలకు స్పేస్ డాకింగ్ ఒక కీలకమైన అవసరం. ఈ మిషన్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఇస్రో అటానమస్ డాకింగ్‌కు పునాది వేస్తోంది. చంద్రయాన్ 4 వంటి భవిష్యత్ మిషన్‌లకు ఇది కీలకమైన సామర్థ్యం. గగన్ యాన్ మిషన్, చంద్రుడిపైకి భారతీయ వ్యోమగామిని పంపడం, భారత్ అంతరిక్ష స్పేస్ స్టేషన్ ఏర్పాటు వంటి భారతదేశ ప్రతిష్టాత్మక అంతరిక్ష లక్ష్యాలకు మద్దతు ఇవ్వడంలో స్పాడెక్స్ మిషన్ కీలక పాత్ర పోషిస్తుంది. చంద్ర యాత్రలను చేపట్టడం, అక్కడి నుండి నమూనాలను తిరిగి తీసుకురావడం, ఇండియన్ స్పేస్ స్టేషన్ (బిఎఎస్)ను అభివృద్ధి చేయడం వంటి భారతదేశం యొక్క భవిష్యత్తు ప్రతిష్టాత్మక అంతరిక్ష ప్రణాళికలకు ఈ మిషన్ కీలకం.

**మిషన్ యొక్క ప్రధాన లక్ష్యాలు:**
రెండు చిన్న వ్యోమనౌకలను ఉపయోగించి వాటిని సమీకరించడం, డాకింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం, ప్రదర్శించడం. డాక్ చేయబడ్డ స్థితిలో కంట్రోల్‌ని డిస్‌ప్లే చేయడం. టార్గెట్ చేయబడ్డ స్పేస్ క్రాఫ్ట్ యొక్క జీవితకాలాన్ని పొడిగించే సామర్థ్యాన్ని ప్రదర్శించడం. డాక్ చేసిన వ్యోమనౌకల మధ్య విద్యుత్ శక్తి బదిలీని పరీక్షించడం లాంటి లక్ష్యాలను కలిగి ఉంది.

**పీఎస్ఎల్వీ ద్వారా నాంది:**



స్పాడెక్స్ అనేది పిఎస్ఎల్వి ప్రయోగం ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమనౌకల అంతరిక్షంలో డాకింగును ప్రదర్శించడానికి రూపొందించిన తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక ప్రదర్శన మిషన్. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ)-సీ60 (స్పేస్ డాకింగ్ ఎక్స్పెరిమెంట్) స్పాడెక్స్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి 2024 డిసెంబర్ 30న ఇస్రో ప్రయోగించింది. వ్యోమనౌకను విజయవంతంగా ప్రయోగించడంతో మిషన్ ప్రారంభమైంది. ఉపగ్రహ సేవలు, అంతరిక్ష కేంద్రం కార్యకలాపాలు, గ్రహాంతర అన్వేషణ వంటి కీలకమైన సామర్థ్యం ఉన్న వ్యోమనౌకలు లేదా ఉపగ్రహాలను డాకింగ్, అన్డాకింగ్ చేయడంలో భారతదేశం యొక్క సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడం ఈ అపూర్వ మిషన్ యొక్క లక్ష్యం. డాకింగ్ ప్రక్రియను అత్యంత కచ్చితత్వంతో నిర్వహించారు. ఈ వ్యోమనౌక 15 మీటర్ల దూరం నుంచి 3 మీటర్ల దూరం వరకు నిరంతరాయంగా కలిసి కచ్చితత్వంతో డాకింగ్ ప్రారంభించి స్పేస్ క్రాఫ్ట్ ను విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీని తరువాత ఉపసంహరణ సజావుగా పూర్తయింది. తరువాత స్థిరత్వం కోసం దృఢత్వం జరిగింది. డాకింగ్ అనంతరం రెండు ఉపగ్రహాలను ఒకే వస్తువుగా సమీకృత నియంత్రణను విజయవంతంగా సాధించి భారత సాంకేతిక నైపుణ్యాన్ని చాటింది. రానున్న రోజుల్లో ఈ వ్యవస్థను మరింత పరీక్షించడానికి శాటిలైట్ సెపరేషన్ క్యాంపెయిన్, పవర్ ట్రాన్స్‌ఫర్ పరీక్షలను నిర్వహించనున్నారు. స్పాడెక్స్ ఉపగ్రహాలలో ఒకటి 15 మీటర్ల వద్ద స్థానాన్ని కలిగి ఉంది.

**స్పాడెక్స్ వ్యోమనౌక:**
స్పాడెక్స్ మిషన్లో రెండు చిన్న ఉపగ్రహాలు ఉన్నాయి. అవి ఒకటి సిడిఎక్స్ 01.ఇది ఛేజర్. రెండు ఎస్‌డిఎక్స్ 02 ఇది లక్ష్యం. ఒక్కొక్కటి 220 కిలోల బరువు ఉంటాయి. ఏదైనా వ్యోమనౌక డాకింగ్ సమయంలో ఛేజర్లుగా (క్రియాశీల వ్యోమనౌక) పనిచేయగలదు. సోలార్ ప్యానెల్స్, లిథియం అయాన్ బ్యాటరీలు, పటిష్ఠమైన పవర్ మేనేజ్ మెంట్ సిస్టం ఉన్నాయి. యాటిట్యూడ్ అండ్ ఆర్బిట్ కంట్రోల్ సిస్టమ్ (ఏఓసీఎస్)లో స్టార్ సెన్సర్లు, సన్ సెన్సార్లు, మాగ్నెటోమీటర్లు, రియాక్షన్ వీల్స్, మాగ్నెటిక్ టార్కర్లు, థ్రస్టర్లు వంటి యాక్చువేటర్లు ఉంటాయి.

ఉపగ్రహ కక్ష్యలో డాకింగ్ ప్రక్రియను ప్రదర్శించడానికి అనేక సంక్లిష్ట ప్రక్రియలు ఉన్నాయి. డాకింగ్ తర్వాత రెండు ఉపగ్రహాలు ఒకే స్పేస్ క్రాఫ్ట్‌గా పనిచేస్తాయి. డాకింగ్ విజయాన్ని ధృవీకరించడానికి విద్యుత్ శక్తి ఒక ఉపగ్రహం నుండి మరొక ఉపగ్రహానికి బదిలీ చేయబడుతుంది. విజయవంతంగా డాకింగ్, అన్ డాకింగ్ తర్వాత స్పేస్ క్రాఫ్ట్‌ను వేరు చేసి అప్లికేషన్ మిషన్‌లకు ఉపయోగిస్తారు. అన్ డాకింగ్ సమయంలో వ్యోమనౌకను వేరు చేయడం ద్వారా వారి ప్రైవేట్ పేలోడ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ పేలోడ్లు అధిక రిజల్యూషన్ చిత్రాలు, సహజ వనరుల పర్యవేక్షణ, వృక్ష అధ్యయనాలు మరియు కక్ష్య రేడియేషన్ పర్యావరణ కొలతలను అందిస్తాయి.

**స్వదేశీ సాంకేతికత:**
డాకింగ్ మెకానిజం, నాలుగు కెమెరాలు, డాకింగ్ సెన్సార్లతో కూడిన సెట్, .పవర్ ట్రాన్స్ ఫర్ టెక్నాలజీ, స్వదేశీ స్వయంప్రతిపత్తితో డాకింగ్ సాంకేతికత, స్పేస్ క్రాఫ్ట్ ల మధ్య స్వయంప్రతిపత్త కమ్యూనికేషన్ కోసం ఇంటర్ శాటిలైట్ కమ్యూనికేషన్ లింక్ (ఐఎస్ఎల్), ఇతర వ్యోమనౌకల స్థితిని తెలుసుకోవడానికి ఇన్ బిల్ట్ ఇంటెలిజెన్స్ తో జతచేయబడింది. ఇతర వ్యోమనౌకల సాపేక్ష స్థానం, వేగాన్ని నిర్ణయించడానికి జిఎన్ఎస్ఎస్ ఆధారిత రిలేటివ్ ఆర్బిట్ డెసిషన్ అండ్ ప్రొపరేషన్ (ఆర్ఓడిపి) ప్రాసెసర్ ఉంది. హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ డిజైన్ వాలిడేషన్ టెస్టింగ్ రెండింటికీ సిమ్యులేషన్ టెస్ట్ బెడ్స్ ఉన్నాయి.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

## పోగులేసుకుందాం

ఇద్దరం ఒకతల్లి పిల్లలమే
నీదేమో పొడుగురెక్క
నాదేమో శిన్నగుండే
తాతలు దెచ్చిన సద్దికూడు ఉట్టిమీద
ఎవలకందితే ఆళ్ళు తినాలని అంటున్నవ్
అట్లెట్లన్నా....?

ఎవని బుక్క వానికుండాలన్న
మన బహుజన పెద్దమనిషి
శెప్పిన మాట యాది మరిశినవా?
లేకా మరుగున పెడుతున్నవా!?

నువ్వు వర్గీకరణ/పంచుకునుడు వద్దన్నవంటే
మనువెట్లా జెప్పిండో గట్లనే ఉండన్నట్టు
దాన్ని కాదన్న అంబేద్కర్ ను
అవమానించినట్లే అన్నా...

నాకు సన్నాయి నొక్కులు రావన్నా
నాదంతా డెడ్డెంకడెం డెడ్డెంకడెం డప్పుల
దరువే...

వాటా అడిగినప్పుడల్లా నీవు
ఐక్యతా వేట కొడవలెత్తి
నా మీద దాడి జేత్తున్నావ్

అన్నా...
ఉన్నదొక్కటే లేత బక్కగొడ్డు
ఏ మాయలోడో వచ్చి
మంత్రిచ్చి మాయంజేయకముందే
కలిసే పంచుకుందాం
ఎవరిపోగు వాళ్లమెత్తుకుందాం
ఎవరి బలం ఆళ్ళం పెంచుకుని
ఉమ్మడిగా పోరుజేద్దాం

అన్నా...
రాజ్యాధికారం మన జేతులకచ్చి
నీవే గనక పీఠమెక్కేరోజత్తే...

నీ కాళ్ళ తొడుగులకోసం
మనం కలిసి కోసుకున్న గొడ్డుతోలును
తంగేడు శెక్కెశి లందల్లో నానబెట్టిన
మహా ఒడుపుగా మలుత్తడని పేరున్న
మా ఎండి కట్టయ్య తాత శేత
నున్నటి కిర్రుచెప్పులు శేయించి తెత్తా

నీవు గద్దెనెక్కేనాడు ఊరేగింపులా
ఊదూది ఊపిరాపుకున్న
మా సుందర్రావు తాతను పిలిశి
మన ఇజయం లోకమంతా తెలిశేలా
కొమ్ముొదిపిత్తా.....

మన జాతి పట్టాభిషేకం ఇందునాడు
కాల్ తలకాయ కూర కమ్మగండే
మా సారయ్యా తాతను పిలిశి
మసాలా దట్టించి కాల్దాల్కాయ శోరువ పెట్టిత్తా...

ముడుసుల్ల మూలుగసొంటి మనసులను
హత్తుకుని
వేడుక జేసుకుందాం రా... అన్నా....

వాటాలు పంచుకున్నా...
ఒకటిగెట్లుండొచ్చో పెపెంచానికి పాఠమైదాం !
కొత్త చరిత్రకు
దళిత తల్లుల వారసులమై నిలబడదాం!!

**(ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా...)**

**- దిలీప్.వి**
8464030808

## అతి పెద్ద 'స్టార్టప్‌ల హబ్'గా భారతం

అత్యాధునిక డిజిటల్ ప్రపంచంలో 3వ అతి పెద్ద 'స్టార్ట్అప్ల హబ్(అంకుర కేంద్రం)'గా యువభారతం అవతరించడం హర్షదాయకం. ఒక సరి కొత్త ఆలోచనతో మొదలు పెట్టే వినూత్న వ్యాపార ప్రారంభ దశను స్టార్ట్అప్ అని పిలుస్తారు. స్టార్ట్అప్ అనే పదానికి అంకురార్పణ, ఉపారంభం, నాంది, శ్రీకారం, సమారంభం అనే అర్థాలు ఉన్నాయి. సాధారణంగా ప్రారంభ దశలో ఉన్న వాణిజ్య సంస్థలను స్టార్ట్అప్లు లేదా అంకుర సంస్థలుగా పిలుస్తాం. స్టార్ట్అప్లను ప్రారంభించడం అంత సులభమేమీ కాదు. మన వినూత్న ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి కంపెనీ స్థాపన, నిధుల సేకరణ, మౌళిక వనరులు/వసతుల కల్పన, మానవ వనరులు, సరైన శ్రమ అవసరం అవుతాయి. 2023 నాటికే కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 1,15,000 స్టార్ట్అప్లు దేశవ్యాప్తంగా టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణ లాంటి రంగాల్లో ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లో యువభారత స్టార్ట్అప్ల ఎకోసిస్టమ్ మరింత పుంజుకోనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.




ఆత్మ నిర్భర భారత్ నిర్మాణానికి వెన్నెముక వలె అన్ని రంగాల్లో స్టార్ట్అప్లు ప్రారంభం కావాలని 2022లో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావించి ప్రారంభించిన 'జాతీయ స్టార్ట్అప్ దినోత్సవం' ప్రతి ఏట 16 జనవరి రోజున నిర్వహించడం ఆనవాయితీగా మారింది. స్టార్ట్అప్ల స్థాపనలు పుంజుకున్నపుడు దేశ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధుల కల్పన, అంకుర సంస్థల ప్రగతి, స్వయం సమృద్ధ భారతం, ఆత్మనిర్భర భారత్, 2047 నాటికి వికసిత్ భారత్ కలల సాకారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చొరవ తీసుకోవడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. దేశాభివృద్ధిలో స్టార్ట్అప్ల అమూల్య పాత్రను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లోనే స్టార్ట్అప్ ఇండియా స్కీమ్‌ను తీసుకురావడం జరిగింది. ఈ పథకం ద్వారా స్టార్ట్అప్లకు సులభ రిజిస్ట్రేషన్ల వ్యవస్థ, పన్నుల్లో రాయితీలు, ఆర్థిక చేయూత, సులభ వ్యాపార విధానాలు, ఇన్నొవేషన్కు ఊతం ఇవ్వడం, పాలసీలను రూపొందించడం, పరిశ్రమలు-అకడమియా అనుసంధానాలు, ఇంక్యుబేషన్ మెంటర్షిప్ లాంటి పలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. నేడు భారత్లో ఉన్న 1.15 లక్షల రిజిస్టర్డ్ స్టార్ట్అప్లతో 100 యూనికార్న్స్, వివిధ రంగాలకు విస్తరణలు, మార్గ్ ప్లాట్ఫామ్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ లాంటి ప్రోత్సాహక పథకాలు తీసుకురావడం సంతోషదాయకం. నేటి జాతీయ స్టార్ట్అప్ దినోత్సవ వేదికగా పరిశోధనలకు ప్రేరణ, గ్రామీణాభివృద్ధి దిశగా స్టార్ట్అప్ల స్థాపనలు, అంతర్జాతీయ సహకారం, టెక్నాలజీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనువైన వాతావరణ కల్పన, డిజిటల్ రంగంలో సానుకూల మార్పులు లాంటి అత్యవసర సౌకర్యాలు సత్వరమే అందుబాటులోకి తేవాలని కోరుకుందాం. యువ భారత్ అంటే స్టార్ట్అప్ల పర్యాయపదంగా నిలవాలని ఆశిద్దాం. ప్రతి ఒక్క స్టార్ట్అప్, వినూత్న ఆలోచన ప్రగతికి వేసిన మరో ముందడుగు అని భారత యువత నమ్మాలి.

**- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## గ్రంధాలయం



జ్ఞాన బండాగారం గ్రంథాలయం
పుస్తకాల నిలయం విజ్ఞాన సంపద
మనిషి వికాసానికి మూల స్తంభాలు
సమాచార కేంద్రం గ్రంథాలయం!!

బంగారు భవిష్యత్తుకు బాటలు
బాలల వినోదాల గ్రంథాలయం
తరతరాల విజ్ఞాన సంపద
మనిషిని మనీషిగా మార్చేది!!

సరస్వతి నిలయం గ్రంథాలయం
భవితకు బాట గ్రంథాలయం
అక్షరాల ఆలయ మది
పుస్తకాల పరిచయం అది!!

విలువలెన్నో నేర్పుతది
విజ్ఞానులను చేస్తది
పాఠకులకు జ్ఞాన సంపద
సమాజ వికాసానికి మూల స్తంభాలు!!

**- దేవులపల్లి రమేశ్**
9963701294

## కళకళల సంక్రాంతి!

పండుగ అంటేనే జీవితాన్ని
ప్రకాశవంతంగా వెలిగించే
మధురోహల ఆగమనం!

పేదవాడికి సైతం మూడు రోజులు
రాచరికం కట్టబెట్టే వైభవాల క్రతువు
భోగి సంక్రాంతి కనుమ..
పాడిపంటలకు కొదవలేని
గ్రామాభ్యుదయాన్ని
కడిగిన ముత్యంలా కళ్లకు కట్టి
పేద గొప్ప భేదం లేక
మనసుల్లో దూరి మత్తెక్కించి
కొత్త బట్టలు కట్టి
పిండివంటలు తినిపించి
ఆనందాల అంబారీ ఎక్కించి
ఊర్లూతలూగించే ఆనంద క్షణాలు
హేమంత సూరీడి హేమకిరణాలతో

ప్రతి తనువు పులకరిస్తే..
సత్సంప్రదాయాల సందళ్ళతో
ప్రతి ఊరు ప్రతి ఇల్లు ప్రతి మది
దేదీప్యంగా వెలుగులు చిమ్ముతుంది
తెలుగువాడి హృదయాంతరాల్ని
తట్టి లేపి గుండె నిండుగా పరవశింపజేసే
అత్యద్భుత ఆచారాల
కళకళల కాంతి క్రాంతి సంక్రాంతి!

**- భీమవరపు పురుషోత్తమ్**
9949800253

## జ్ఞాపకాలంతే....

అయినవారమని కొందరు
కావలసిన వారమని ఇంకొందరు
బంధువులమని మరికొందరు
బాధ్యత వహిస్తామని మరికొందరు
అలా జీవితంలోకి వచ్చిపోతుంటారు

మంచోళ్ళని కొందరు
ముంచేటోళ్లు ఇంకొందరు
మాటలతో తూటాలు దింపేవారు మరికొందరు
మూర్ఖపు మాటలతో వేధించేవారు మరికొందరు
అలా జీవితంలోకి వచ్చిపోతుంటారు

పాఠాలు బోధిస్తూ కొందరు
గుణపాఠాలు నేర్పిస్తూ ఇంకొందరు
అనుభవాలు నింపుతూ మరికొందరు
అనుభూతులు ఒలికిస్తూ మరికొందరు
అలా జీవితంలోకి వచ్చిపోతుంటారు

గతాన్ని తవ్వుతూ కొందరు
భవిష్యత్ తెలియజేస్తూ ఇంకొందరు
వర్తమానంలో మదిని కుళ్ళబొడుస్తూ మరికొందరు
జ్ఞాపకాలంతే... తడిపి ముద్దచేస్తుంటాయి
అలా జీవితంలోకి వచ్చిపోతుంటాయి

**- వాసి జ్యోత్స్న**
9866843005

ఎడిట్ పేజీ కోసం మీ మీ వ్యాసాలు, సామాజిక విశ్లేషణలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
– ఎడిటర్

# యువతరం పిడికిలెత్తితే-సవాళ్ళు సలామ్ చేస్తాయి!



భారత దేశం ప్రపంచంలోనే అధిక జనాభా గల దేశంగా అవతరించింది. దేశ జనాభాలో 65 శాతం 35 ఏళ్ల లోపు వారే!. ఈ యువశక్తిని మరియు దేశ జనాభాలో సగ భాగమైన మహిళా శక్తిని నైపుణ్యం గల మానవ వనరులుగా తీర్చిదిద్ది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఉత్పాదక శక్తి పెంచుకోవడంలో మన దేశంలో అలక్ష్యం రాజ్యమేలుతుంది. యువత అంటే? ఏదో ఒక కుటుంబానికి చెందినవారు మాత్రమే కాదు. భావి భారత ప్రగతి నిర్మాతలుగా, యావత్ జాతి సంపదగా భావించి వారిలోని యువశక్తి సద్వినియోగ పరచబడాలి. వారి నైపుణ్యాలకు పదును పెట్టి వారికి నచ్చిన రంగాల్లో ఎదగనివ్వాలి. యువతరం విద్యాబుద్ధులతో పాటు విమర్శనాత్మకంగా ఆలోచించడం, సమకాలీన నైపుణ్యాలు పెంచుకోవడంతో పాటు వారి విజ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలి. సమస్యలు, సవాళ్లకు కుంగిపోకుండా జీవితాన్ని అర్థవంతం చేసుకోవడానికి కావలసిన ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందించుకోవాలి. యువతరానికి జీవితం విసిరే కఠిన సవాళ్లను దీటుగా ఎదుర్కోగలిగిన ఆత్మ శక్తిని, పట్టుదలను, ప్రోత్సాహాన్ని కల్పించవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. ఇదే దేశానికి అద్భుతమైన పెట్టుబడి అవుతుంది.



అబ్బాయి పుట్టింది అమ్మాయి ప్రేమ కోసమో, అర ఎకరం భూమి కోసమో, ఆండ్రాయిడ్ ఫోన్ కోసమో కాదు. అమ్మాయి పుట్టింది అబ్బాయి ప్రేమ కోసం, అమ్మ అవడం కోసం మాత్రం అంతకన్నా కాదు. కాల క్రమంలో వయసు పెరుగుతుంటే కొన్ని మానసిక, శారీరక మార్పులు, ఉద్వేగాలు సహజంగా జరుగుతాయి. ఆ మార్పులను స్వాగతిస్తూ జీవితంలో నైతిక విలువలు, విచక్షణతో ముందుకు సాగాలి. కానీ అంతకన్నా ముందు మిమ్మల్ని కన్న తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న ఆశలను సాకారం చేస్తూ, ఈ దేశ పౌరులుగా దేశ భవిష్యత్తు నిర్మాతలుగా ఎదగాల్సింది మీరే. ఆ శక్తి సామర్థ్యాలు మీలోనే ఉన్నాయి. కానీ నేటి యువత పైపై ఆకర్షణలనే ప్రేమనుకుని, మరోవైపు మద్యం, డ్రగ్స్ , కాలాన్ని నిర్లక్ష్యం చేయడం తదితర వ్యసనాలకు బానిసై ఎంతో విలువైన నిండు జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు. 'పుట్టుక నీది చావు నీది నడుమ బతకంతా దేశానిదే' అన్న కాళోజీ స్ఫూర్తిని, అలాగే యువతలో స్ఫూర్తి నింపిన స్వామి వివేకానంద లాంటి మహనీయుల జీవిత ఆశయాలను విస్మరిస్తున్నారు. అనైతిక పెడ ధోరణులు ఆండ్రాయిడ్ ఫోన్ మాయలో పడి చాలా విలువైన కాలాన్ని వృధా చేస్తున్నారు. యువతలోని శక్తిసామర్థ్యాలను ప్రపంచ దేశాలకు పంచి ఆ శక్తిని సమాజ అభివృద్ధి కోసం పాలకులు ఉపయోగించు కోవాలని మార్గ నిర్దేశం చేశారు. అంతేకాదు వారి రచనలు యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపి, సక్రమ మార్గంలో నడిచేలా ఉంటాయి.

వాటిని అధ్యయనం చేయడంలో యువత నిర్లక్ష్యం చేస్తున్నారు. స్వామి వివేకానందుడు తన జీవిత కాలమంతా కృషి చేశారు. వారి జీవిత ప్రయాణం చిన్నదైనా సమాజానికి, పాలకులకు యువతకు ఎన్నో విలువైన రచనలు, సందేశాలు అందించడంతో పాటు ప్రపంచ దేశాల వేదికల మీద ప్రసంగించిన భారతీయుడుగా ప్రపంచ చరిత్ర పుటల్లో నిలిచారు. అందుకే 12 జనవరి స్వామి వివేకానంద జన్మదినాన్ని మన దేశం 'జాతీయ యువజన దినోత్సవంగా' నిర్వహించుకుంటుంది. కాలానికి ఎదురీది కావలసింది సాధించాల్సింది యువతనే. పాలకులు యువతను సక్రమ మార్గాన నడిపించి స్వార్ధ రహిత సమాజాన్ని నిర్మించాల్సింది పోయి యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నారు. పవిత్రులు, స్వార్థ రహితులైన స్త్రీ, పురుషులను నాకు ఇవ్వండి నేను ఈ ప్రపంచాన్ని కదిలిస్తానన్నారు. శక్తి అంతా యువతలోనే ఉంది అన్నారు. విలపించడం మానండి, ప్రపంచంలో ఉన్న దేవుళ్ళందరికీ మొకరిల్లి విలపించినా దుఃఖం తొలిగిపోదు. మూఢనమ్మకాలకు లొంగకుండా, బానిస కాకుండా జాగరూకుడవై నువ్వే అనంతుడవై ఉండాలని స్వామి వివేకానంద అన్నారు. నేటి యువత ధైర్యంగా ముందుకు సాగాలి, ప్రతి పని అవహేళన, వ్యతిరేకత తర్వాతే ఆమోదం పొందుతుందని గమనించాలి. సంసిద్ధత, పని మీద శ్రద్ధాసక్తులు ఉంటే ఏ శక్తి అడ్డుకోలేదు. ఇతరుల దోషాలు ముచ్చటించక మీ లక్ష్యసాధన వైపు పయనించాలి. నాయకుడు సేవకుడుగా ఉంటూ ప్రేమించే హృదయంతో, పని చేయాలనే తపనతో అమలు చేసిన వ్యక్తుల చరిత్రే ప్రపంచ చరిత్ర. ప్రతి పనిలో ఆచరణాత్మకతను విడనాడడం వల్లనే దేశం పూర్తిగా నాశనం అవుతుందనేది కాదన లేని నిజం. యువకులు మహత్కార్యాలు సాధించడానికే జన్మించారని నమ్మి బాధ్యతలను మీ భుజాల మీద వేసుకొని మీ భవిష్యత్తుకు మీరే బాధ్యులని తెలుసుకోవాలి. మీకు కావాల్సిన బలం శక్తి మీలోనే ఉన్నాయి, మరణించడానికి ముందు జీవితం పరమావధిని సాధించాలని తెలియజేశారు. ఎంతసేపు జరిగిపోయిన దాని గురించి, జరగబోయే దాని గురించి ఆలోచిస్తూ.. చేతిలో ఉన్న పనిని నిర్లక్ష్యం చేస్తారు. ఆ చిన్న అశ్రద్ధ ఎదుగుదలకు పెద్ద అవరోధంగా మారుతుంది. ఉన్న వర్తమానాన్ని సద్వినియోగం చేసుకుంటూ మన శక్తి మొత్తాన్ని చేస్తున్న పనిపై పెట్టడమే విజయ సూత్రం. ఈ విధానంలో ప్రయత్నిస్తూ భారతీయ యువతకు స్పష్టమైన దిశా నిర్దేశం లేదనే అపకీర్తిని యువత, పాలకులు సమిష్టి నిర్ణయాలతో తుడిచి పారేయాలి. అలాగే నేటి యువత సన్మార్గంలో నడుస్తూ, వర్తమానాన్ని సద్వినియోగ పరుచుకోవడమే ఈ సమాజానికి మీరిచ్చే అద్భుతమైన బహుమతి. 'జస్ట్ డెడికేట్ యువర్ సెల్ఫ్ టు నౌ' యువతకు బెస్ట్ కెరీర్ అడ్వైజర్ ఇదే.. ఏ దేశ ప్రగతికైనా సమర్థ మానవ వనరులే కీలకం అని భావిస్తూ స్వామి వివేకానంద ఆశయాలు, యువత ఆకాంక్షలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలకపాత్ర వహించాలి. చరిత్రలో యువత ఆగ్రహానికి నియంతలే నేలకూలారన్న సోయితో, ప్రజాశ్రేయస్సే పరమావధిగా పాలన సాగించండి.

**- మేకిరి దామోదర్**
9573666650

## కొత్త రోగాల పుట్ట

కొత్త కొత్త వైరస్ లతో లోకం
కొత్త పాశం చుట్టుకుంటోంది
ఊపిరి సలుపని అనారోగ్యాలతో
ఉసురు తీసుకుంటోంది
వ్యసన దారుల్లో మనిషి నడకలు
హద్దులు దాటి పరుగులెడుతోంది
పొద్దుపోని అలవాట్లు సంక్రమించాక
మలిపొద్దు చూడని స్థితి తిష్ట వేసింది
మొన్న కరోనా కలకలం
చెట్టును కొమ్మల్ని వేరు చేసింది
గుండె నడకకు అడ్డు వేసే
గతుకుల పయనం మనిషిదైంది
గీతను దాటి విజృంభించే రోగం
దేశాలనే కబలిస్తోంది
ఇప్పుడు మరో కొత్త రోగం
రెక్కలిప్పిన రాకాసి పక్షిలా
నిరోధక శక్తిలేని శరీరాలపై
కొత్తం యుద్ధం ప్రారంభించింది
పాత పద్ధతిలోనే దేహంలో చేరి
కొత్త విపత్తుకు దారి తీసింది

మనిషి మనుగడ నానాటికీ
ప్రశ్నార్థకంగా మారిపోతూనే వుంది
మారాలి మారిపోవాలి
దురలవాట్లను దూరం చేస్తూనే
దుర్గుణాలకు స్వస్తి పలకాలి
దురాలోచనలకు చరమగీతం పాడి
దూరంగా ఆలోచించాలి
కొత్త రోగాల బారి నుంచి
చాకచక్యంగా తప్పించుకోవాలి
మనకేం కొత్త కాదు
రోగాలను ఆధిగమించే శక్తి
మనిషి మస్తిష్కంలో పుష్కలంగా వుంది
భయం నీడలో కాకుండా
చైతన్యపు వెలుగులో అడుగెయ్యాలి
కొత్త రోగాల పుట్టను
పగిలిపోకుండా నిలువరించాలి

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

# కొత్త రేషన్ కార్డులపై మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ

- పాత రేషన్ కార్డులపై కీలక నిర్ణయం
- కొత్త రేషన్ కార్డుల పై గ్రామాల్లో సర్వే



**సైదాపూర్, జనవరి 17(మనం న్యూస్):** ఈనెల 26 నుంచి రాష్ట్రంలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, ఎగ్లాస్పూర్, గర్రెపల్లి, సోమవారం, వెన్నంపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అనంతరం ఆయన దుద్దెనపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. అర్హత లేని వారికి రేషన్ కార్డులు మంజూరు చేయవద్దని అధికారులను హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఈనెల 26న గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అర్హుల జాబితాను విడుదల చేసి పథకాలను అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మండలంలోని బొమ్మకల్ నుంచి హుజురాబాద్ వరకు రూపాయలు 5.27 కోట్ల నిధులతో తార్ రోడ్డును నిర్మిస్తామని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంత సుధాకర్, వెన్కేపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గుడారం శ్రీనివాస్, మేకల రవీందర్, మిట్టపల్లి కిష్టయ్య, చాంద్ పాషా, లంకదాసరి మల్లయ్య, న్యాడండ్ల రాజ్ కుమార్, బొమ్మగాని రాజు, కూతురు విద్వాన్ రెడ్డి, శ్రీనివాస్, చాడ కొండల్ రెడ్డి, వెంకటేశం, మునిగంటి సంతోష్, వేముల శ్రీనివాస్, గొల్లపల్లి యాదగిరి, వేముల సురేష్, భాస్కర్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల సాయికుమార్, యూత్ కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజవర్గ ప్రధాన కార్యదర్శి బోనగిరి అనిల్, ఆసరి రఘు, తిరుపతి నాయక్, వెంకటేష్, అజయ్, శ్రీనివాస్, రాహుల్, శ్రీ రాగన్, మణిదీప్ తదితరులు ఉన్నారు.

## డబుల్ రోడ్డు తర్వాత గతిన మంజూరు చేయాలి

- తహసీల్దార్‌కు వినతి సమర్పించిన గ్రామస్తులు

**గంభీరావుపేట, జనవరి 17 (మనం న్యూస్):** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు గ్రామస్తులు శుక్రవారం డాక్టర్ గౌటే గణేష్, పెద్దూరి పరశురాం గౌడ్ ఆధ్వర్యంలో రాజుపేట కొత్తపల్లి గ్రామం నుండి గంభీరావుపేట ఎమ్మార్వో కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలుగా పడి ఇబ్బందికరంగా ఉందని, పోవడానికి రావడానికి చాలా ఇబ్బందికరంగా ఉన్నదని, రోడ్డు గురించి పలుమార్లు అప్పుడున్న శాసనసభ్యులు, మంత్రి కె.టి.ఆర్. కు చాలాసార్లు విన్నవించుకోవడం జరిగిందని, కొత్తపల్లి ఎల్లమ్మ గుడి నుండి శిలాజీనగర్ బోర్డర్ వరకు (3కి.మీ. దూరం) రోడ్డు గురించి చాలా ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహారదీక్షలు, భిక్షాటనలు, రోడ్డు పైన వరినాట్లు వేసి నిరసనలు తెలిపామని అన్నారు.



## నేత్ర పర్వంగా శివ పార్వతుల కళ్యాణం



- ఆదిదేవుడికి పుష్పాలతో వేదిక అలంకరణ
- సమ్మోహనంగా వేదికపై ఆశీనులైన శివ పార్వతులు

**గంగాధర, జనవరి 17( మనం న్యూస్):** శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గంగాధర మండలంలోని నందగిరి కోట్ల నరసింహులపల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శ్రీ శివపార్వతుల కళ్యాణోత్సవం అత్యంత కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వేదికను ఆదిదేవుడికి ఇష్టమైన పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదికపై ఆశీనులైన శివపార్వతులకు ఆలయ అర్చకులు పోరండ్ల శర్మ, సహ అర్చకులు పరమేశ్వరుడికి యజ్ఞోపవీత ధారణ పర్వాలు, జీలకర్ర బెల్లం, కన్యాదాన తంతు కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితులు నిర్ణయించిన సుముహూర్తంలో అమ్మవారి మెడలో పరమేశ్వరుడు మాంగల్యధారణ చేశారు. స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ముత్యాల తలంబ్రాలను అర్చక, వేద పండితులు వేదోక్త పఠనాల నడుమ ఆలకింప జేసే ఆధ్యాత్మిక ఘట్టాలు భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా కొనసాగింది. భక్తులు ఆయా గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కళ్యాణాన్ని వీక్షించి తరించారు. అనంతరం కైలాస వాసుడైన శివ పార్వతులకు భక్తులు ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, చీర, గాజులు సమర్పించి దర్శనం చేసుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఆలయ అభివృద్ధి సమితి, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కోట కవిత - మల్లారెడ్డితో పాటు ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## మరోసారి ఉదారత చాటుకున్న తూడి లచ్చన్న

- తూడి లచ్చన్నకు ప్రజల అభినందనల వెల్లువ



**గంగాధర, జనవరి 17(మనం న్యూస్):** గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చన్న మరోసారి తన ఉదారత చాటుకున్నారు. ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి సాయం చేస్తూ బాసటగా నిలుస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో, వ్యక్తిగతంగా తన దృష్టికి వస్తున్న సమస్యలపై త్వరితగతిన స్పందిస్తూ బాధితులకు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుతున్నారు. ఈ క్రమంలో గంగాధర మండలం నారాయణ పూర్ గ్రామానికి చెందిన పరుపుదాల్ల కొమురవ్వ గత కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుందన్న విషయాన్ని యువసేన సభ్యులు తెలుపగా వెంటనే స్పందించి వారి గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రామడుగు మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం ఆనారోగ్య కారణంగా మరణించిన మిట్ట కుమార్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి తన వంతు సహాయంగా 10 వేల రూపాయలు అందజేశారు. బోయినపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మార్గం రామస్వామి అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా తూడి లచ్చన్న స్పందిస్తున్న తీరుపై ప్రజల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమాలలో పెరుక మహేష్, పెంచాల మహేష్, నాగార్జున, కరుణాకర్, నరేష్, జవ్వాజి శేఖర్, మిట్ట మధు, బైరి శ్రీధర్, కూనివేణి రాజశేఖర్, పిట్టల మనోహర్, కత్తి మధు, కటుకం మనీష్, కొల్లూరి రాజు, మిట్ట శ్రీనివాస్, దైవల తిరుపతి, మల్లేశం, చింతపంటి సాగర్, కోల మహేందర్, టింకు, అనిల్, మిట్ట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు



- పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్.

**మంచిర్యాల, 17జనవరి (మనం న్యూస్):** తమపై ఎలాంటి పోలీస్ కేసులు లేవని క్లియరెన్స్ నిమిత్తం కొంతమంది తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించడం జరుగుతుందని, అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని కేసులు నమోదు చేయడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్ ఐజి తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జోన్ ల పరిధిలోని వారు పాస్ పోర్ట్ కోసం, ఉద్యోగ నియామకాల కోసం, బయట దేశాలకు వెళ్లడం కోసం, తదితర కంపెనీ, సంస్థలు, పరిశ్రమలలో పనిచేయడం కోసం పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పి.వి.సి ) పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పిసిసి) కోసం దరఖాస్తులు చేసుకొనే కొంతమంది వారిపై గతంలో కేసులు నమోదు కాబడిన కూడా తమపై ఏలాంటి కేసులు లేవని పోలీస్ కేసుల క్లియరెన్స్ నిమిత్తం తప్పుడు అఫిడవిట్‌లు సమర్పిస్తున్నారని, రామగుండం కమీషనరేట్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది వారి దరఖాస్తు ఆధారంగా విచారణ చేసినప్పుడు కొంతమంది పై కేసులు నమోదు అయినట్లు గుర్తించడం జరిగిందన్నారు. గతంలో కూడా తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇప్పుడు తప్పుడు అఫిడవిట్‌లు ఇచ్చిన సుమారు 20 మందిని స్పెషల్ బ్రాంచ్ వారు గుర్తించడం జరిగిందని చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే వారెవరైనా తప్పుడు అఫిడవిట్ సమర్పించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని సిపి హెచ్చరించారు. అఫిడవిట్ నోటరీ చేసే వాళ్ళు కూడా వారి దగ్గరకు అఫిడవిట్ కోసం వచ్చే వాళ్లకు కూడా తప్పుడు సమాచారంతో అఫిడవిట్ ఇస్తే విచారణలో పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేస్తారన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధితో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, జనవరి 17(మనం న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతూ, ప్రమాదాల్లో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. శుక్రవారం గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 90 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం మంజూరు కాగా వారికి మధుర నగర్ చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రూ. 28,50,306 విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ తో తమను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, గంగాధర సింగిల్ విండో వైస్ ఛైర్మన్ వేముల భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి , కంకణాల రాజగోపాల్ రెడ్డి, బూర్గు గంగన్న, దోర్నాల శ్రీనివాసరెడ్డి, తాళ్ల శ్రీనివాస్, కర్ర విద్యా సాగర్ రెడ్డి, సత్తు కనుకయ్య, రాచమల్ల భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, మధు, రుద్ర మల్లేశం, మహేష్, శంకర్, కోల ప్రభాకర్, గంగాధర సుదర్శన్, మ్యాక వినోద్, రెండ్ల రాజిరెడ్డి, శ్రీధర్, ఆనంద్, ప్రభాకర్, వేముల అంజి, రోహిత్ రెడ్డి, కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జయరామ్ పై దాడికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదు



- మంచిర్యాల కాంగ్రెస్ నాయకులు
- బిజెపి నాయకులపై డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు

**మంచిర్యాల, 17 జనవరి (మనం న్యూస్):** మంచిర్యాల మిట్టపల్లి జయరామ్ రావు పై బుధవారం జరిగిన దాడి ఘటనను తమ ఎమ్మెల్యే పై రుద్దేందుకు ప్రయత్నం చేస్తున్నారని జయరామ్ పై దాడికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని మంచిర్యాల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పై దుష్ప్రచారాలను చేస్తున్న బిజెపి నాయకులపై డీసీపీ భాస్కర్ ను అయన కార్యాలయంలో కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లడారు. జయరామ్ పై దాడికి మంచిర్యాలలో ఎక్కడ గొడవ జరిగినా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు అంటకట్టడం విపక్షాలకు రివాజుగా మారిందని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు, కౌన్సిలర్ గాజుల ముఖేష్ గౌడ్, మిట్టపల్లి లక్ష్మిలు తమ ఎమ్మెల్యేపై డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేయడం ఏమిటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి అన్నారు. వ్యక్తిగత గొడవలు, భూతగాదాలను ఎమ్మెల్యే కనుసన్నల్లో జరుగుతున్నాయని అభియోగించడం శోచనీయమని, ఆ దాడికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని, ఉదయం దాడి జరిగితే రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆంతర్యం ఏమిటన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యేను ప్రజల్లో పలుచన చేయడానికి బీజేపీ, బీఆరెస్‌లు రెండు విపక్షాలు సంయుక్తంగా కుట్ర పన్నాయని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉబలాట పడిన రఘునాథ్ రావుకు టికెట్ రాకపోవడంతో మతిభ్రమించి తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. తమ ఎమ్మెల్యే కాంగ్రెస్ శ్రేణులను క్రమ శిక్షణలో ఉంచుతున్నారని, వారి శ్రేణులు గీత దాటే విధంగా ప్రేరేపితం చేయవద్దని, చట్టం తన పని చేసుకుపోతుందని తప్పు చేసే వారికి శిక్ష పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బొగ్గు పెన్షన్ దారుల సమస్యలు పరిష్కరించాలి

### కోల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సిఎంపిఫ్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ విక్రమ్ దేవ్ దత్తకు వినతి పత్రం



**మంచిర్యాల, జనవరి17 (మనం న్యూస్):** కోల్ మైన్స్ పెన్షన్ స్కీం 1998 నుండి ప్రారంభించినప్పటి నుండి బొగ్గు కార్మికులకు రిటైర్డ్ అయిన రోజు నుంచి ఎంత మంజూరు చేయబడిందో అంతే చెల్లించడం వలన అతి తక్కువ పెన్షన్ తో జీవించలేక పోతున్నారని పెన్షన్ ను పెంచి, బొగ్గు పెన్షన్ దారుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రాంచందర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళ వందార్ వేణు మాధవ్ లు కోరారు . శుక్రవారం సింగరేణి భవన్ హైదరాబాద్ లో జరుగుతున్న 183 వ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనై జేషన్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశానికి విచ్చేసిన కోల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సిఎంపిఫ్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ విక్రమ్ దేవ్ దత్తాను కలసి అన్ని వివరాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పిం చారు. ఈ సమావేశానికి వచ్చిన ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షులు రమేంద్ర కుమార్, రాకేష్ కుమార్, ఎచ్ ఎం ఎస్, డి. రామానందన్, సీఐటీయూ, బోర్డు ఆఫ్ ట్రస్ట్ సభ్యులకు కూడా కలిశామని, తరిగిపోతున్న బొగ్గు పెన్షన్ నిధిని బలోపేతం చేస్తూ బొగ్గు గనుల్లో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ప్రశాంత జీవితం గడపడానికి వారి అవసరాలకు అనుగుణంగా నెలవారి పెన్షన్ సవరించాలని కోరారు. నెలవారి పెన్షన్ సవరించాలని అధికారులకు, మంత్రులకు, రాజకీయ నాయకులకు వినతి పత్రాలతో పాటు అనేక వేదికల ద్వారా సమర్పించడం జరిగిందని, కానీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకొనలేదని ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులూ తెలిపారు. అన్ని పత్రాలు ఆన్ లైన్ కంప్యూట రైజేషన్ చేసిన తరువాత కూడా పెన్షన్ మంజూరు చేయడానికి రెండు మూడు నెలలు ఎదురు చూడవలసి వస్తుందని, దీనికి ఎస్ బిఐ, ధన్ బాద్ లో జరుగుతున్న జాప్యం నివారించాలని, కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్, బ్యాంకుల వద్ద ఉన్న ఉద్యోగుల సమాచారం మేరకు సవరించిన పెన్షన్ పే ఆర్డర్లు జారీ చేయాలని, రివైజ్ పెన్షన్ పే ఆర్డర్ పొందినప్పటికి పెన్షన్ పొందటానికి అధికారుల సంతకాల కొరకు వృద్దాప్య వితంతువులు తిరగవలసి వస్తుందని, బ్యాంక్ అధికారులకు తగిన మార్గదర్శక సూత్రాలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదని, 2024 మార్చి 8 న ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం అందరికి కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు చెల్లించే చర్యలు తీసుకోవాలని కోల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సిఎంపిఫ్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ విక్రమ్ దేవ్ దత్తకు వారు వివరించారు. ఈ వివరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కోల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వారికి హామీ ఇచ్చారు.

## జగిత్యాల పట్టణ అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి, జనవరి 16 (మనం న్యూస్):** అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియని జగిత్యాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పురపాలిక పరిధిలోని 5, 20, 21, 37వ వార్డుల్లో 85 లక్షలతో మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్స్ కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గం అభివృద్ధికి ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మరిన్నీ నిధులు మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పాటు పడుతోందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్య అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, జగిత్యాల ఎమ్మెల్యే చొరవతో జిల్లా కేంద్రంలో అందరికీ అందుబాటులో వైద్య కళాశాల ఏర్పాటు చేశామని, మాత శిశు ఆసుపత్రి అందరికీ అందుబాటులో ఉండే విధంగా కృషి చేశారని పేర్కన్నారు. జగిత్యాల పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పారిశుద్ధ్య సమస్య తీరుతుందని చైర్ పర్సన్ అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు ఏర్పాటు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, స్థానిక కౌన్సిలర్‌లు గుగ్గిళ్ళ హరీష్, అల్లే గంగాసాగర్, అనుమల్ల కృష్ణ హరి, అనిల్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు నాయకులు కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుంది

- బీసీ సంక్షేమ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్
- త్వరలో కొత్త రేషన్ కార్డులు



**చిగురు మామిడి, జనవరి 17 (మనం న్యూస్):** చిగురుమామిడి మండలం, కుల సర్వే అప్లికేషన్‌ల సమాచారం ఆధారంగా కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తాయని బీసీ సంక్షేమ అలాగే రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తిలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఇస్తామని వారు వెల్లడించారు. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చన్నారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని తెలిపారు. ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదన్నారు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే దానిని నమ్మవద్దని సూచించారు. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపామని, రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు సత్య ప్రసన్న రెడ్డి కాంగ్రెస్, మండల పార్టీ అధ్యక్షులు అలాగే హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌ఓరుగంటి భారతి దేవి, బొడిగె పరుశురాములు, నాయకురాలు కర్ణ కంటిమంజుల రెడ్డి, చింతపూల నరేందర్, వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

# సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి, జనవరి 17, మనం న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు క్షేత్ర స్థాయిలో నిర్వహించబడుతున్న ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం ఆమె చౌటకూర్ మండలంలోని సుల్తాన్పూర్, సరాఫ్ పల్లి గ్రామాలను సందర్శించి, సర్వే బృందాల పనితీరును తనిఖీ చేశారు. సర్వే కోసం నియమించిన బృంద అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా భాద్యతతో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుని వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన డేటాను సక్రమంగా నమోదు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియలో సరైన డేటాను సేకరించాలని అన్నారు. ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఖచ్చితత్వంతో ఈ ప్రక్రియను నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. సుల్తాన్పూర్ ,సరాఫ్ పల్లి గ్రామాలలో కలెక్టర్ స్వయంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారి పరిస్థితులను సమీక్షించారు. లబ్ధిదారుల వివరాలు, పథకాలకు అర్హత వంటి అంశాలను ఆమె సర్వే బృందాలతో కలిసి పరిశీలించారు. సర్వే ప్రక్రియలో ప్రజలను స్థానిక నాయకులను భాగస్వాములుగా చేసి, ప్రజలతో నేరుగా మమేకమవడం ద్వారా తగిన సమాచారం సేకరించాలని , ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా చూడటమే మీ కర్తవ్యం అని కలెక్టర్ బృందాలకు సూచించారు. రైతు భరోసా పథకం ద్వారా చిన్న రైతులకు, పేద రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గృహిణులకు నివాసాలను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సంక్షేమాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. సర్వే బృందాల పనితీరును సమీక్షించిన కలెక్టర్, జాప్యం లేకుండా త్వరితగతిన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చూడాలి. సర్వే ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించండి అని ఆమె సర్వే సిబ్బందికి సూచించారు. , సర్వే బృందాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, తగిన సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అందోల్ ఆర్డీఓ పాండు, తహసీల్దార్ కిరణ్ కుమార్ సంబంధిత తదితరులు ఉన్నారు.

# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



- సింగాపూర్‌లో సర్వే పరిశీలించిన కలెక్టర్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 17 (మనం న్యూస్):** ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో జరుగుతున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల వివరాలు నమోదు చేయాలన్నారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించి ఇంటింటికీ వెళ్లి కుటుంబ ఆర్థిక స్థితిగతులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం నిబంధనలు పాటించాలని సూచించారు. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, డీడబ్ల్యూవో సబిత, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**రైతుభరోసా సర్వే పరిశీలన:**

హుజురాబాద్ మండలం బోర్నపల్లి శివారులో చేపట్టిన రైతు భరోసా సర్వేను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. కేవలం సాగు చేస్తున్న భూములనే రైతు భరోసా కింద నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయేతర భూములు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు ఉంటే వాటిని మినహాయించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమేష్ బాబు, తహసీల్దార్ కనకయ్యను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# నేడు దుబ్బాక నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటన

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**తొగుట, జనవరి 17, మనం న్యూస్:** దుబ్బాక నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ శనివారం దుబ్బాక నియోజకవర్గంలో పర్యటిస్తారని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంత్రి కొండా సురేఖ ఉదయం 10 గంటలకు చేగుంట మండలం వడియారం గోల్డెన్ ఫంక్షన్ హాల్ లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, 11 గంటలకు గొల్లపల్లి గ్రామంలో 33 కెవి సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, అనంతరం, దౌల్తాబాద్ మోడల్ స్కూల్ హాస్టల్ ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు దౌల్తాబాద్ వద్ద మోడల్ ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన, అనంతరం భూంపల్లి పిహెచ్సి ప్రారంభోత్సవం ఒంటిగంటకు దుబ్బాక చిల్డ్రన్ పార్క్, మల బురదను శుద్ధి చేయడానికి నిర్మించే కర్మా గారాలను ప్రారంబించిన అనంతరం మధ్యాహ్నం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భోజనం చేసిన తరువాత తొగుట మండలం ఎల్లారెడ్డి పేట్ వద్ద మల్లన్న సాగర్ నీటిని విడుదల చేస్తారని, అనంతరం మధ్యాహ్నం



3 గంటలకు సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట అర్బన్, చిన్నకోడూరు మండలాల్లో ఒక కోటి రూపాయల నిధులతో పనులతో సీసీ రోడ్డు కు భూమి పూజ చేస్తారని తెలిపారు. సిద్దిపేట రంగనాయక్ సాగర్ నుండి నీటి విడుదల చేస్తారని, చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామంలో మోడల్ ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేసి సాయంత్రం 5.00 గంటలకు హైదరాబాద్ తిరుగు ప్రయాణం అవుతారని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

# అర్హత గల నిరుపేదలకే సంక్షేమ ఫలాలు కలెక్టర్

- సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**హైదరాబాద్, జనవరి 17(మనంన్యూస్):** శుక్రవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని చైతన్యపురి కాలనీ వార్డ్ నెంబర్ 9 రేషన్ కార్డు వెరిఫికేషన్ మరియు నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి లోని నాన్ కల్టివేషన్ ల్యాండ్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపికకు కసరత్తును ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో కలిసి సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పథకం, అమలు చేస్తున్నట్లు రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి 12 వేలు పెట్టుబడి సహాయం అందుతుందన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేలు రూపాయలను అందించను న్నట్లు, ఒక్కో విడతకు 6 వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని, చెప్పారు. అర్హత వున్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళ యాప్ ద్వారా గుర్తించిన వారిలో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. గ్రామసభ లు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలోని వార్డుల్లో అర్హుల జాబితాల రూపకల్పన తయారు చేయాల న్నారు. అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తోన్న ఈ సర్వే ప్రక్రియలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలను గుర్తించాలని, భూములు, ఆదాయం, వంటి వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా నిర్లక్ష్యానికి తావివ్వకుండా కుటుంబాల సమగ్ర వివరాలను



సేకరించి, ఫార్మ్ లో క్రమ పద్ధతిలో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం | నియోజకవర్గానికి 3500 ఇళ్లు

## రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




**సిద్ధిపేట, జనవరి 17, మనం న్యూస్ ప్రతినిధి:** రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నాఫెడ్, టిజి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ లో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన కందులను ప్రభుత్వం మద్దతు ధర రూ. 7550లతో కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడ్ల కొనుగోలు చేసిన 48 గంటలలో పేమెంట్ చేసినట్లు తెలిపారు. జనవరి 26 నుండి వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా ఇస్తున్నామని, రైతు భరోసా 12 వేలకు పెంచినట్లు తెలిపారు. భూమిలేని ఉపాధి కూలీలకు 12 వేలు ఇస్తున్నామన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తున్నామన్నారు. గత 10 సంవత్సరాలనుండి రేషన్ కార్డులు లేవని, రేషన్ కార్డులు ఉన్న ఎలాంటి మార్పులు, చేర్పులు లేకపోవడంతో ప్రజలు ఎంతో కష్టపడ్డారన్నారు. ఈ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొత్త రేషన్ కార్డులు, మార్పులకు, చేర్పులకు అవకాశం కల్పిస్తుందన్నారు. త్వరలోనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడ పర్యటించి అయిల్ ఫాం సాగు పై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమములో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటయ్య ఇతర అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్ లో కలపాలి

- మంత్రి పొన్నంకు టిఎన్జిఓ నాయకుల వినతి

**సిద్దిపేట, జనవరి 17, మనం న్యూస్ ప్రతినిధి:** గతంలో జరిగిన జోన్ల విభజనలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్లో, మెదక్, సిద్దిపేట జిల్లాలు రాజన్న సిరిసిల్ల జోన్లో కలపడం వల్ల ఉద్యోగులు ప్రమోషన్లతోపాటు ఇతర విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్లో కలిపి ఉద్యోగులకు ఊరట కల్పించాలని సిద్దిపేట జిల్లా టిఎన్జీఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కోమండ్ల విక్రం రెడ్డిలు మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డిని కోరారు. శుక్రవారం రోజున సిద్దిపేటలో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను టిఎన్జిఓ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిఎన్జిఓ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాను జోన్ల విభజనలో భాగంగా సిద్దిపేట జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్లో కలపడం వల్ల ఉద్యోగులు



ప్రమోషన్లతో పాటు ఇతర అంశాల్లో నష్టపోయారని, 317 మీద ఉప సంఘంలో సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై దృష్టి సారించి సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్లో కలిపేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఉప సంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, మార్పులు చేరుకున్న విషయాలో రాష్ట్రపతి వద్దకు నిర్ణయం పంపించి సాధ్యాసాధ్యాలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు టిఎన్జిఓ నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జిఓ సహాధ్యక్షులు నిమ్మ సురేందర్ రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా యూనిటి అధ్యక్షులు మఠం శశిధర్, కార్యదర్శి పోతుల సత్యనారాయణ, ఎం. నగేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు షాపుపై దాడి

- మద్యం స్వాధీనం

**చిన్నకోడూరు, జనవరి 17, మనం న్యూస్:** మండల పరిధి మాచాపూర్ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో బెల్టు షాపుపై దాడి చేసి పోలీసులు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్.ఐ. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మాచాపూర్ గ్రామానికి చెందిన తేళ్ల లక్ష్మీనారాయణ బెల్టు షాపు నిర్వహిస్తూ అక్రమ మద్యాన్ని అధిక ధరలకు అమ్ముతున్నాడనే సమాచారం రాగా రైడ్ చేసి రూ. 13 వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు.



# గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలి

- ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయాలి
- ఆత్మీయ భరోసా అర్హులైన అందరికీ అందించాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట, జనవరి 17, మనం న్యూస్ ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పథకాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరాలని



మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులతో హరీష్ రావు కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అధికారంలోకి వచ్చి 13 నెలలువుతున్నా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలను పక్కకు పెట్టి ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లలో ప్రజలను ఘోరంగా మోసం చేస్తుందన్నారు. లబ్దిదారుల ఎంపిక విషయంలో గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, ఈ గ్రామ సభల్లో పార్టీ శ్రేణులు పాల్గొని అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీయాలని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో రెండు లక్షల మంది ఉపాధిహామీ కూలీలుంటే ప్రభుత్వం తెచ్చిన నిబంధనతో 75 వేల మందికే వర్తిస్తుందన్నారు. మిగతా 1 లక్ష 25 వేల మంది కూలీల సంగతి ఏంటని ప్రశ్నించారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఆత్మీయ భరోసా పథకం రైతు కూలీలందరికీ అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో అర్హులైన నిరుపేదలందరికీ అందేలా చూడాలన్నారు. కులగణనతో సంబంధం లేకుండా రేషన్ కార్డులను జారీ చేయాలని, గత ప్రభుత్వంలో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారి సంగతేంటని గ్రామసభల్లో నిలదీయాలన్నారు. ప్రతీ పథకం అరులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

# వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను టూరిస్ట్ స్పాట్ గా అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు
- వెలుగుమట్ల పార్క్ బౌండరీ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు
- పార్క్ వద్ద ప్లాస్టిక్ ని బ్యాన్ చేయాలి
- వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను సందర్శించిన మంత్రి తుమ్మల




**ఖమ్మం, జనవరి 17(మనం బ్యూరో):** వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను టూరిస్ట్ స్పాట్ గా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి స్థానిక వెలుగుమట్ల అర్బన్ పార్కును సందర్శించారు. పార్క్ అభివృద్ధి ప్రణాళిక ను మంత్రి పరిశీలించి, పార్క్ లో కలెక్టర్, అధికారులతో కలిసి మొత్తం పార్క్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం లోపు వెలుగు మట్ల అర్బన్ పార్కును టూరిస్ట్ స్పాట్ గా అభివృద్ధి చేయాలని అన్నారు. ఖమ్మం చరిత్ర నేపథ్యంతో ఆకర్షణీయంగా ఉండే విధంగా వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు మంచి పేరు పెట్టాలని అన్నారు. ఖమ్మంతో పాటు కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలలో కూడా అర్బన్ పార్క్ ల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

వెలుగు మట్ల అర్బన్ పార్కుకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కొంత మంది అనాలోచితంగా తమ భూమి సెంటు, గజం పోతుందని ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుతం ఉన్న భూమి విలువ కంటే రోడ్డు వేసిన తర్వాత 10 రెట్లు పెరుగుతుందని అన్నారు. రోడ్డు బాగుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ వద్ద ప్లాస్టిక్ వాడకం నిషేదించాలని, ఇక్కడ క్యాంటీన్ లో కూడా చిరు ధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పెట్టాలని, స్వశక్తి మహిళా సంఘాలచే స్టాల్ ఏర్పాటు చేయాలని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ సంబంధించిన భూమి బౌండరీ ఫెన్సింగ్ చేయాలని అన్నారు. ఫెన్సింగ్ లోపల చుట్టూ రోడ్లు, చెక్ డ్యాంలో నీరు అందుబాటులో ఉండాలని అన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే తరాలను పార్క్ కు తీసుకొని వచ్చి ప్రకృతిని కాపాడుతూ, అభివృద్ధి సాధించడం ఎలా అనే అంశం తెలియజేసేలా పార్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రకృతిని ధ్వంసం చేయడం వల్లే అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దానిని నివారించేందుకు పార్క్ అభివృద్ధి చేపట్టామని, గత రెండు నెలలుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అర్బన్ పార్క్ ను సందర్శిస్తున్నారని, ఇక్కడి అంశాలు కుటుంబ సభ్యులతో పంచుకుంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఖమ్మం నగరానికి పది నిమిషాల దూరంలో 500 ఎకరాలలో పార్క్ ఉండటం అదృష్టమని అన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఈ పార్క్ లు ఉపయోగమని అన్నారు. ప్రతి రోజు ప్రస్తుతం వేయి మంది వరకూ సందర్శకులు వస్తున్నారని, పిల్లలకు అడ్వెంచర్ గేమ్స్ మరిన్ని మౌళిక వసతులు కల్పిస్తే భవిష్యత్తులో రోజుకు 2 వేల నుంచి 3 వేల మంది, వారాంతాలలో 6 వేల వరకూ సందర్శకులు వచ్చే అవకాశం ఉందని, దీనికి వల్ల స్థానిక ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని అన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ 1977 లో 546 ఎకరాలకు అర్బన్ పార్క్ నోటిఫికేషన్ జరిగిందని అనంతరం భూ పోరాటంలో భాగంగా చాలా వరకు భూమి కోల్పోయామని, 2016లో మంత్రివర్యుల హయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జాయింట్ సర్వే చేసి, దాదాపు 250 ఎకరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత సంవత్సరం నుంచి మంత్రివర్యులు ప్రత్యేక శ్రద్ధతో ఫాలో అప్ చేస్తూ టి.యూ.ఎఫ్.ఐ.డి.సి నుంచి 3 కోట్లు మంజూరు చేసి ఇక్కడ బోటింగ్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కోటి 28 లక్షల హరిత నిధి నుంచి పార్కుకు మంజూరు అయ్యాయని, ఇక్కడ జింకల పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వారంలో 5 నుంచి 6 పాఠశాలల నుంచి విద్యార్థులు సందర్శనకు వస్తున్నారని అన్నారు. గతంలో నెలకు 50 నుంచి 60 వేల ఆదాయం వస్తే ప్రస్తుతం నెలకు 2 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని అన్నారు. పార్క్ వద్ద సోలార్ పార్కింగ్ ఏర్పాటు చేశామని, యోగా షెడ్ వద్ద కూడా రూఫ్ పై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేశామని అన్నారు.పార్క్ వద్ద ప్లాస్టిక్ వాడకం నివారణ ప్రాధాన్యతగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పూనుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, శిక్షణ ఐపీఎస్ రుత్విక్ సాయి, డిఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పేదలకందించాలి

- జెడ్పీ సీఈవో నాగలక్ష్మి

**పాల్వంచ, జనవరి 17(మనం న్యూస్) :** ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందించడమే లక్ష్యంగా ఉద్యోగులు పాటుపడాలని జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి పునుకుల గ్రామ పంచాయతీలో జరుగుతున్న సర్వే సరళిని నిశితంగా పరిశీలించారు. ఆహార భద్రత కార్డు వెరిఫికేషన్, ఇందిరమ్మ గృహాలు, ఆత్మీయ భరోసా పనులను పరిశీలించారు. వివాదాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. స్పష్టతతో కూడిన వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె విజయ భాస్కర రెడ్డి, ఎంపీవో బి నారాయణ, ఐకెపి ఏపీఎం నాయుడు రాంబాబు, బి బాబురావు, పంచాయతీ కార్యదర్శి, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఛత్తీస్‌ఘడ్ రక్తసిక్తం

- 16 రోజులు.. 5 ఎన్ కౌంటర్లు...
- 34 మంది మావోయిస్టుల మృతి
- పోరులో అసువులు బాసిన 9 మంది జవాన్లు
- అన్నలకు కలసిరాని కొత్త ఏడాది



**చర్ల, జనవరి 17 మనం న్యూస్) :** ఛత్తీస్‌ఘడ్ దండకారణ్యం రక్తసిక్తమవుతోంది. భద్రతా బలగాలు, మావోయిస్టుల నడుమ జరుగుతున్న హోరాహోరీ పోరులో ఇరు వర్గాలు భారీగా నష్టపోతున్నాయి. ఈ ఏడాది మొదటి 16 రోజులలో జరిగిన ఐదు ఎన్ కౌంటర్లలో 34 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎదురు కాల్పులలో తొమ్మిది మంది పోలీసులు అమరులయ్యారు.

మావోయిస్టులకు 2025 సంవత్సరం కలసి రాలేదనే చెప్పాలి. కొత్త ఏడాది ప్రారంభంలోనే పదుల సంఖ్యలో సహచరులను కోల్పోవడం ఆ పార్టీని గట్టిదెబ్బతీసింది. జనవరి 3 వ తేదీన ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం గరియాబాద్ జిల్లా అమలిపాల్ అడవులలో జరిగిన ఎదురు కాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడంతో ప్రారంభమయిన ఎన్ కౌంటర్ల ప్రక్రియ పూజార్ కాంకేర్ వరకు కొనసాగింది. పదహారు రోజుల వ్యవధిలో జరిగిన ఐదు ఎన్ కౌంటర్లలో ఇప్పటి వరకు 34 మంది మావోయిస్టులు మృతి చెందారు. జనవరి 5 వ తేదీన నారాయణ్ పూర్ - దంతెవాడ జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్ లో నలుగురు మావోయిస్టులతో పాటు సన్ను కరమ్ అనే డిఆర్‌జి కానిస్టేబుల్ మృతి చెందారు. జనవరి 6 వ తేదీన బీజాపూర్ జిల్లా బెద్రె - కుత్రుం రహదారిపై మావోయిస్టులు ఐఈడి పేల్చడంతో ఎనిమిది మంది జవాన్ లు అక్కడికక్కడే మృతిచెందారు. జనవరి తొమ్మదిన భీజపూర్ జిల్లా గుంద్రాతిగూడెం-వలిగూడ అడవులలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఎనిమిది లక్షల రివార్డు కలిగిన డివిసిఎం సభ్యుడు మహేష్ తో పాటు మరో ఇద్దరు మృతి చెందారు. జనవరి 13 వ తేదీన అదే బీజాపూర్ జిల్లా మద్దేడు అడవులలో జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు డివిసిఎం సభ్యుడు రైస్ హేమ్లాతో పాటు మరో నలుగురు ఏరియా కమిటీ సభ్యులు మృతి చెందారు. తాజాగా అదే బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పూజారి కాంకేరు - మారేడుబాక అటవీప్రాంతంలో గురువారం జరిగిన ఎన్ కౌంటర్ లో 19 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఎన్ కౌంటర్ లో తెలంగాణా కేడర్ కు చెందిన మావోయిస్టులు సైతం మృతి చెందారనే ప్రచారం సాగుతోంది. ఇలా ఈ ఏడాది ప్రారంభంలో నే మావోయిస్టు పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. గత ఏడాది పదుల సంఖ్యలో జరిగిన ఎన్ కౌంటర్లలో 220 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. వందల సంఖ్యలో అరెస్ట్ లు, లొంగుబాట్లు జరగడంతో గత ఏడాది మావోయిస్టులకు చేదు జ్ఞాపకాలు మిగిలాయి. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ భద్రతా బలగాలు దూకుడును ప్రదర్శించడంతో మావోయిస్టులు కకలావికలం అవుతున్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నక్సల్స్ ఏరివేత కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గతంలో ఎన్నడూ పోలీసులు వెళ్లని దట్టమైన దండకారణ్యం, అంబూజ్మడ్ అడవులలోకి భద్రతా బలగాలు చొచ్చుకు వెళ్లి శత్రువును దెబ్బకొడుతుజడటం విశేషం. 2026 మార్చి నాటికి దేశంలో మావోయిజం లేకుండా చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఇందులో భాగంగా మావోయిస్టులకు కంచుకోట వంటి పూవర్తి, జీడిపల్లి, కవరగట్ట వంటి వేల గ్రామాలలో లక్షకు పైగా భద్రతా దళాలు బేస్ క్యాంప్ లను ఏర్పాటు చేసి నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. సి ఆర్ పి ఎఫ్, బిఎస్ఎఫ్, డి ఆర్ జి, కోబ్రా, గ్రేహౌండ్స్, ఎస్ టి ఎఫ్ వంటి ఎటువంటి వాతావరణమయినా తట్టుకునే సుశిక్షుతులయినా బలగాలను మావోయిస్టుల ఏరివేత కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. వీరంతా మావోయిస్టులను నలువైపుల నుండి చుట్టుముట్టి ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న నక్సల్స్ ఏరివేత కార్యక్రమం ఇలాగే కొనసాగితే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు మావోయిస్టులు సైతం భద్రతా బలగాలను దెబ్బకొట్టేందుకు యత్నిస్తున్నారు. పోలీసులు సంచరించే మార్గాలపై దృష్టి సారించి ఎక్కడపడితే అక్కడ ఐఈడిలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా జనవరి ఆరవ తేదీన బీజపూర్ జిల్లా బెద్రే రహదారిపై శక్తివంతమైన ఐఈడితో వాహనం పేల్చివేసి పోలీసులపై పంజా విసిరారు. ఈ ఘటనలో వాహన డ్రైవర్ తో పాటు ఎనిమిది మంది జవాన్లు మృత్యువాత పడ్డారు. మరో వైపు ఎన్ కౌంటర్లకు బాధ్యులను చేస్తూ ఇన్ ఫార్మం పేరుతో అదికార పార్టీ నాయకులు, గ్రామస్తులను మావోయిస్టులు హత మారుస్తున్నారు. ఈ చర్యలను జీర్ణించుకోలేని భద్రతా బలగాలు మావోయిస్టులపై పూజారి కాంకేర్ ఎన్ కౌంటర్ రూపంలో ప్రతీకారం తీర్చుకున్నాయి. పూజారి కాంకేర్ - మారేడుబాక అటవీప్రాంతంలో మావోయిస్టులు సమావేశం అయ్యారన్న పక్కా సమాచారంతో శిభిరంపై దాడిచేసి 18 మందికి పైగా మావోయిస్టులను మట్టుబెట్టారు. ఇలా ప్రతిరోజూ ఛత్తీస్ఘడ్ లోని దండకారణ్యం, అంబూజ్మడ్ అడవులు తుపాకుల మోతతో దద్దరిల్లుతున్నాయి. పదుల సంఖ్యలో మృత్యువాత పడుతూ పచ్చటి అడవులలో రక్తపుటేరులు పారుతున్నాయి.

# వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు గ్రౌండింగ్ అవ్వాలి

- కుటుంబానికంతటికి ఆహ్లాదం కల్గించాలి
- పర్యావరణ హిత పార్క్ గా రూపకల్పన
- పార్కు అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష



**ఖమ్మం, జనవరి 17(మనం బ్యూరో):** వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు ఫిబ్రవరి నెలాఖరుకు గ్రౌండింగ్ అయ్యేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనుల కార్యాచరణ పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వైరా హైవే రోడ్ నుండి వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత భూ యజమానులతో సంధి చర్చలు జరిపి భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. రోడ్డు నిర్మాణంతో భూ ధరలు పెరిగి, యజమానులు లాభపడతారన్నారు. అర్బన్ పార్క్ వెనుక భాగం ఫెన్సింగ్ చేపట్టాలన్నారు. సరిహద్దు వివాదాల వద్ద జాయింట్ సర్వే చేపట్టి, సమస్యలు పరిష్కరించాలన్నారు. హైవే రోడ్ పై అర్బన్ పార్క్ వెళ్లే చోట మంచి ఆకర్షణీయమైన ఆర్చ్ ఏర్పాటుచేసి, బస్ స్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ పార్క్ కు మినీ బస్ లు నడిపేలా కార్యాచరణ చేయాలన్నారు. అర్బన్ పార్క్ వద్ద పార్కింగ్ కు ఏర్పాట్లు చేయాలన్నారు. బయటి తినుబండారాలకు అనుమతి ఇవ్వవద్దని, పార్క్ లోపలి క్యాంటీన్ పదార్థాలను మాత్రమే అనుమతించాలని అన్నారు. క్యాంటీన్ ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, బయో వస్తువులు మాత్రమే వాడేలా చూడాలన్నారు. వాటర్ పాయింట్స్, డస్ట్ బిన్ లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలన్నారు. నామ సూచికలు ఆకర్షణీయంగా ప్రదర్శించాలన్నారు. వాకింగ్ ట్రాక్ అధునీకీకరించి, వాకింగ్ క్లబ్ లతో మాట్లాడి, వాకింగ్ ట్రాక్ సద్వినియోగం చేసుకునేలా, వాకర్స్ ప్రకృతితో మమేకమై మరింత ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. పిల్లలకు ప్లే జోన్, యువతకు అడ్వెంచర్ పార్క్, యోగా, వాకింగ్ ట్రాక్ ఇలా అన్ని వయసుల వారు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్క్ చుట్టూ పెట్రోలింగ్ చేపట్టాలని, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష లో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎఫ్డివో మంజుల, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, ఇరిగేషన్ ఇఇ రామకృష్ణ, డిఇ రాంప్రసాద్, ఎఫ్ఆర్వో నాగేశ్వరరావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలనా దక్షత నేటికీ ఆదర్శం

- ఆర్జేసి కృష్ణ



**ఖమ్మం, జనవరి 17(మనం న్యూస్):** తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణ దేవరాయలు అని, ఆయన పరిపాలనా దక్షత నేటికీ ఆదర్శనీయమని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ కొనియాడారు. శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా మున్నూరుకాపు సంక్షేమ సంఘం అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమానికి కృష్ణ అతిథి గా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కి ఎన లేని సేవ చేసిన వ్యక్తి శ్రీ కృష్ణ దేవరాయలు అని పేర్కొన్నారు. ఆయన పరిపాలనా దక్షుడని తెలిపారు. రాయల వారి పరిపాలనా ఆదర్శ నీయమని వెల్లడించారు.రాయల వారి పెద్ద విగ్రహాన్ని ఖమ్మం లో ఏర్పాటు చేయాలి అని కోరారు.ఆయన స్ఫూర్తి తో మున్నూరు కాపులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు నాయకులు కొత్తా సీతారాములు ,శ్రీ హరి,నాసరయ్య, నరేందర్ రాపర్తి రాజా,మాటేటి రవి , నరేష్ మోహన్ నాయుడు,జీవీవీఎల్, తదితరులు పాల్గొన్నారు

## నవోదయ ప్రవేశ పరీక్షకు అన్నిఏర్పాట్లు

**మధిర టౌన్, జనవరి 17(మనం న్యూస్):** జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాసంస్థలలో ప్రవేశం కోసం శనివారం మధిర టీవిఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మధిర మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ తెలిపారు. మధిర టీవీఎం సెంటర్ నందు ఇంగ్లీష్ మీడియం నందు 139, తెలుగు మీడియం నందు 16, మొత్తం 155 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు తెలిపారు. విద్యార్థుల హాల్ టికెట్ నందు పరీక్ష సెంటర్ టివిఎం గరల్స్ హై స్కూల్ గా ఉన్నప్పటికీ మధిర మెయిన్ రోడ్ లోని టీవీఎం ఉన్నత పాఠశాలలో మాత్రమే పరీక్షా కేంద్రం ఉన్నది కావున విద్యార్థులు వారి తల్లిదండ్రులు సకాలంలో టీవీ పాఠశాలకు విచ్చేయాలని సూచించారు. అడ్మిట్ కార్డు తో పాటు ఆధార్ తీసుకుని రావలసిందిగా తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు రెండు గంటల సమయం ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లో 11:30 తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదు కావున ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.ఈ పరీక్షలకు పాలేరు నవోదయ విద్యాలయ సమితికి చెందిన జ్యోతి అబ్జర్వర్ గాను, వై ప్రభాకర్ వ్యవహరిస్తుండగా మేడేపల్లి శ్రీనివాసరావు చీఫ్ సూపరింటెండెంట్, విశ్వనాథం క్లర్క్ విధులు నిర్వహించనున్నారు.




# సోలార్ పవర్ ' ద్వారా పంటపొలాల్లో బోర్లు

- అభినందించిన ఐటిడిఎ పిఓ రాహుల్
- లక్ష్మీదేవిపల్లి మండలంలోని గ్రామాల్లో పొలాల సందర్శన



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 17 ( మనంప్రతినిధి):** ఏజెన్సీ గిరిజన గ్రామాలలో కరెంట్ సౌకర్యం లేని పంట భూములలో బోర్వెల్ వేసుకొని ప్రత్యామ్నాయంగా సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకొని సంవత్సరానికి రెండు పంటలు పండించుకొని జీవనోపాధి పెంపొందించుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం బొజ్జలగూడెం, లక్ష్మీపురం, బంగారుచలక, గ్రామంలోని రైతులు కరెంటు సౌకర్యం లేకపోవడం వలన సోలార్ ద్వారా బోర్వెల్ పంపు సెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించుకొని పంటలు పండిస్తున్న వారి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరెంటు సౌకర్యం లేక చాలామంది రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి పంటలు పండించుకుంటున్నారని, చాలా గ్రామాలలో గిరిజనుల పంట పొలాలు నీటి సౌకర్యం లేక బీడు భూములుగా మారిపోతున్నాయని అన్నారు.ఈ గ్రామంలోని రైతులు సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకొని పంటలు పండించుకోవడం చాలా సంతోషకరమని ఈ సందర్భంగా రైతులను అభినందిస్తూ, ఈ ఆలోచన ఎవరి ద్వారా వచ్చిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మా గ్రామంలో నీటి సౌకర్యం లేక పంటలు పండించలేక చాలా భూములు బీడు భూములుగా మారిపోయాయని, 2017- 18 సంవత్సరంలో రెడ్ కో సంస్థ వారు గిరిజన రైతులకు ప్రత్యేకంగా సలహాలు, సూచనలు ఇచ్చి సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ముందుకు రావడంతో గ్రామంలోని రైతుల అందరం కలిసి బోర్ వెల్స్ తవ్వించుకున్నామని, ఈ బోర్వెల్స్ కి సోలార్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో సంవత్సరానికి రెండు పంటలు పండించుకుంటున్నామని, దాదాపు పది ఎకరాల వరకు వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటున్నామని అన్నారు. సోలార్ తో పాటు మా భూములకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తే తప్పనిసరిగా పంటలు విరివిగా పండించుకొని మా భూములు సస్యశ్యామలము అయ్యేలా చూసుకుంటామని రైతులు పీవో కి తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, మైనింగ్ ఏ డి ఈ రమేష్, రెడ్కో జిఎం అజయ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ రఘురామయ్య, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ ఏఈ మునీర్ పాషా ఫారెస్ట్ జాయింట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సేఫ్టీ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలి

- మంచిర్యాల ట్రాఫిక్ సీఐ బీ. సత్యనారాయణ




**మంచిర్యాల, జనవరి17 (మనం న్యూస్):** వాహనదారులు ప్రతి ఒక్కరు రోడ్డు సేఫ్టీ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ బీ. సత్యనారాయణ కోరారు. మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ-3, 3ఏ గనిపై మంచిర్యాల ట్రాఫిక్ సీఐ బీ. సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. అక్కడి కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. రోడ్డు సేఫ్టీ నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్వి చక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, అతివేగం డ్రైవింగ్‌తో ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. అతి వేగంతో ప్రాణాల మీదకు తెస్తుందని, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే ఆస్కారం ఉందని తెలిపారు. కార్యక్రమంలో గని మేనేజర్ వెంకటేశ్వర్ రావు, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

# ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన

- మహిళా శక్తి భవన నిర్మాణం కొరకు భూమి ఎంపిక పై పర్యవేక్షణ
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి,

**నాగర్ కర్నూల్ ప్రతినిధి జనవరి 17 (మనం న్యూస్)ః** శుక్రవారం నాగర్కర్నూల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు లోని సర్వేనెంబర్ 368 భూమిలో ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం చేపట్టడానికి సంబంధించి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి తో కలిసి, రెవిన్యూ, మున్సిపల్ పంచాయతీరాజ్, డిఆర్డిఏ అధికారులతో ప్రాథమిక స్థాయిలో పరిశీలన చేపట్టారు. శాసనమండలి సభ్యులు కూచకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ కార్యక్రమం, మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, మరియు సామాజిక పురోగతి కోసం కీలకమైన చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, మరియు సామాజిక చైతన్యం కల్పించే ఈ ప్రాజెక్టు, జిల్లాలో మహిళా సాధికారత దిశగా ఒక కొత్త దారిని చూపించనుందని ఆయన తెలిపారు. మహిళల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవలను కొనియాడుతూ, ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి భవన నిర్మాణం ద్వారా, జిల్లాకు కేటాయించిన ఈ భవనాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించి, మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించేందుకు సంబంధిత అధికారులు కావలసిన అనుమతులను వేగవంతంగా పూర్తిచేయాలని ఆయన సూచించారు. ఈ భవనాన్ని ఒక వేదికగా ఉపయోగించి, మహిళలు తమ సామర్థ్యాలను మరింత పెంచుకుంటూ, వారి జీవితాలను మెరుగుపరుచుకునేలా చేసే అవకాశాలు ఏర్పడతాయని, ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత, మహిళలు ఈ భవనంలో నిర్వహించే కార్యక్రమాల్లో



పాల్గొని, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళ సాధికారిత పెంపొందించే దిశగా ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నట్లు, నాగర్ కర్నూల్ పట్టణంలో ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా ఒక బలమైన వేదికగా, ఆర్థిక, సామాజిక, మరియు సాంస్కృతిక పరంగా వారి సాధికారతను పెంపొందించొదుకు ఉపయోగపడుతుందని సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాలు మరియు ఇతర మహిళా శక్తి కార్యక్రమాలతో సంబంధం ఉన్నవారికి అనువైన వసతులను అందించడానికి, ఈ భవనం తలపెట్టడా జరిగిందని, భవనంలో మహిళలకు ఉపాధి అవకాశాలు, శిక్షణ, సామాజిక పరమైన ప్రోత్సాహం, ఇంకా వారి సామర్థ్యాలను పెంచే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో భూమి ఎంపిక కోసం సమగ్రంగా స్థల పరిశీలన చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ భవన నిర్మాణం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు, సామాజిక సాంస్కృతిక అంశాలపై కూడా దృష్టి పెట్టడం, వారి మనోభావాల పరిరక్షణ, మానవ హక్కుల పరిరక్షణ వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటుందని కలెక్టర్ సూచించారు. భవన నిర్మాణం అనేది మహిళల జీవితాలలో పెద్ద మార్పును తీసుకురావడమే కాకుండా, వారి అభ్యున్నతికి, ప్రజాస్వామ్య స్థాయిలో వారికి మరింత ప్రాధాన్యతను ఇస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తి కావడంతో, మహిళలు తమ సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేసుకోగలుగుతారని మరియు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని వివరించారు, ప్రభుత్వా ప్రణాళిక ద్వారా, మహిళలకు ఎక్కడైనా ఏమైనా అవరోధం లేకుండా వ్యాపారాలు ప్రారంభించడానికి, శిక్షణ అందించడానికి, వారి సామర్థ్యాలను ప్రదర్శించ డానికి అనుకూల వాతావరణం ఉంటుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.

## అగ్రికల్చర్ ఎక్సమినేషన్ లో కల్వకుర్తి వాసికు రాష్ట్ర ప్రథమ ర్యాంక్

**కల్వకుర్తి, జనవరి17(మనం న్యూస్)ః** ఐసీఆర్-ఎస్ఆర్ఎఫ్ అగ్రికల్చర్ ఎక్సమినేషన్ లో కల్వకుర్తి పట్టణానికి చెందిన ముబినోద్దీన్ కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్, జాతీయ స్థాయిలో 18వ ర్యాంక్ వరించింది.విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో ముబినోద్దీన్ తోపాటు అతని తండ్రి ఇమాముద్దీన్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కల్వకుర్తి పట్టణానికి చెందిన యువకుడు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంట వైస్ చైర్మన్ షాహేద్,ముస్లీం మైనార్టీ నాయకులు మాక్బుల్, పప్పు,హసన్,కరోనా ఖాదర్,హాఫీజ్, హాజీ,మహమూద్,తదితరులు ఉన్నారు.



# పట్టణాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- భారాసవి వాగ్దానాలే తప్ప అభివృద్ధి లేదు
- కల్వకుర్తి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**కల్వకుర్తి, జనవరి17(మనం న్యూస్)ః** పట్టణాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భారాస గత పది ఏళ్ల పాలనలో వాగ్దానాలే తప్ప అభివృద్ధి శూన్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీలో పరిధిలోని వివిధ వార్డులల్లో 89 లక్షల ృఊఖీ నిధులు,1.17 కోట్ల ఖీుఊ నిధులు,2.80 లక్షల మున్సిపాలిటీ జనరల్ నిధులతో సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులతో పాటు వివిధ కుల సంఘాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్స్,ముస్లీంల పరమపద వాహనానికి స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూజలు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పట్టణాలకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేకూరుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు.గత పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ పార్టీ వాగ్దానాలు చేసిందే కానీ అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు.ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు.కల్వకుర్తి మున్సిపాలిటీని అన్ని రకాలుగా మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ షాహేద్,మాజీ చైర్మన్ శ్రీశైలం,పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి,పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,వెల్దండ పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ సంజీవ్ యాదవ్,మున్సిపల్ కౌన్సిలర్లు సూర్యప్రకాష్ రావు,సౌజన్య, చైతన్య కిషోర్ రెడ్డి,షేక్ ఏజాస్, బావాండ్ల మంజుల మధు,గోరటి శ్రీనివాసులు, నాయకులు షానవాజ్ ఖాన్,చిన్న, తాహేర్అలీ,మక్బూల్,ఖాదర్,దున్న సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై ప్రత్యేక సర్వే

**నాగర్ కర్నూల్, జనవరి 17 (మనం న్యూస్)ః** రైతు భరోసా పథకంలో అర్హులైన గిరిజనులను గుర్తించడానికి శుక్రవారం బిజినపల్లి మండల పరిధిలోని గిరిజన తండాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. చిన్న పీరు తండా గ్రామ పంచాయతీ సమీపంలో శుక్రవారం సాగుకు యోగ్యం కాని భూముల గుర్తించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించారు. గుట్టలను పట్టాచేసుకున్న, పంట పొలాల్లో ఇండ్లు కట్టుకున్న, ప్లాట్స్ చేసుకున్న వారితో పాటు ఇతర కారణాల వల్ల సాగుకు యోగ్యంగా లేని భూములపై సర్వే చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి అర్హులైన ప్రతి రైతును గుర్తించాలని క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాలి, పంచాయతి కార్యదర్శి చిన్నయ్య, వ్యవసాయ అధికారి అఖిల్ కుమార్, మండల రెవెన్యూ ఆఫీసర్ బాలరాజు, గిరిజన తండా వాసులు ఎం.గోవిందు నాయక్, శ్రీశైలం, శ్రీను, గోపాల్, పాషా పాల్గొన్నారు.



# ఒకరి నేత్ర దానంతో ఇద్దరికీ దృష్టి

- జిల్లా కేంద్రంలో తల్లి నేత్రాలు దానం చేసిన తనయులు

**నాగర్ కర్నూల్, జనవరి 17 (మనం న్యూస్)ః** చనిపోయిన తరువాత కూడా తమ మాతృమూర్తి మరో ఇద్దరికీ కంటి చూపు ఇచ్చి మరోసారి జీవించే అవకాశం ఉందని భావించిన జిల్లా కేంద్రానికి చెందిన వారు వారి తల్లిగారి నేత్రాలను దానం చేయించి ఆదర్శంగా నిలిచారు. ఈ మేరకు వారిని పలువురు అభినందించారు. జిల్లా కేంద్రంలోని శాంతా బజారు ప్రాంతంలో నివాసముంటున్న కృష్ణం రాజు సతీమణి పోతుమాంచి పద్మమ్మ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. వారి భర్త, కుమారులు, కూతుర్లు ఆమె నేత్రాలు దానం చేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. వెంటనే జిల్లా నేత్రాధికారి కొ్ట బాలాజీకి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, అదనపు జిల్లా వైద్య ఖాధికారి వెంకటదాస్ లకు సమాచారమందించారు. వారు వెంబడే మహబూబ్ నగర్ నుంచి ఐ డొనేషన్ ఆఫీసర్ శివకుమార్ ను పిలిపించి వారి 2 కార్నియాలను కుటుంబం సమక్షంలో సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆమె భర్త కృష్ణం రాజు, ఆమె కుమారులు శ్రీనివాస్, నర్సింహా రాజు,



రాంప్రసాద్, కూతుర్లు రేణుకా దేవి, గాయత్రి, నేత్రాధికారి కొ్ట బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎవరైనా ప్రమాదంలో గానీ, అనారోగ్య కారణాలతో గానీ రణిస్తే 6 గంటల లోపల నేత్రాధికారి కొ్ట బాలాజీకి 9440876556, 7386940480 నంబర్లకు సమాచారమందించాలని కోరారు. సమాచారం తెలిపితే వెంటనే తగు ఏర్పాటు చేస్తామని, అవసరమైన వారికీ మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉన్నా వారికీ మాత్రమే ఎలాంటి రుసుము లేకుండా కార్నియ అమర్చి మళ్ళీ కొత్త జీవితం, ఆరోగ్య మైన కంటి చూపు ప్రసాధించే అవకాశం ఉందన్నారు. చనిపోయి కూడా సేవ చేసుకుని మానవుడే మహాత్ముడు, భగవంతుడు అయ్యే అవకాశం వుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నడుం బిగించాలని నేత్రదాన మహోద్యమానికి అందరు సహకారం ఇవ్వాలని కోరారు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాడేది



- టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యదర్శి జి మధుగౌడ్

**కల్వకుర్తి, జనవరి17(మనం న్యూస్)ః** జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయు అని రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన కల్వకుర్తి డివిజన్ టియుడబ్ల్యూజే ఐజేయు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత, నిబంధనలు విలువలతో కూడిన ట్రేడ్ యూనియన్ అంటే టియుడబ్ల్యూజే ఐజేయు సంఘమని అన్నారు.టియుడబ్ల్యూజే ఐజేయు సంఘం నిరంతరం జర్నలిస్టుల హక్కుల సాధన, పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం కల్వకుర్తి డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 74మంది జర్నలిస్ట్ సభ్యులు టియుడబ్ల్యూజే సంఘం సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా సభ్యత్వం తీసుకున్న సభ్యుల డబ్బులను జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్ణయ్య,శ్యామ్,సీనియర్ జర్నలిస్టు బచ్చు రామకృష్ణ, కల్వకుర్తి డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన సంఘం సభ్యత్వం పొందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలని వినతి

- పాత ఆసుపత్రిని ట్రామా కేర్ సెంటర్ గా మార్చాలి
- బాలానగర్ 30 పడకల ఆసుపత్రిలో సిబ్బందిని నియమించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వినతి

**జడ్చర్ల, జనవరి 17 (మనం న్యూస్)ః** జడ్చర్లలోని వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలని రోగులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి కావలసిన ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్



రాజనర్సింహ కు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ లో దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల లోని వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆస్పత్రిలో డాక్టర్లు ఇతర సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. వంద పడకలకు సరిపడే వైద్యులు అందుబాటులో లేరని వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా ఇతర సిబ్బంది ఖాళీలు చాలా ఉన్నాయని వాటిని కూడా భర్తీ చేసి రోగులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. బాలానగర్ లోని 30 పడకల ఆసుపత్రికి అవసరమైన ఉద్యోగులను భర్తీ చేయాలని ఇతర సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. బాదేపల్లి లోని పాత ఆసుపత్రిని ట్రామా కేర్ సెంటర్ గా మార్చాలని దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న అంబులెన్స్ స్థానాలలో కొత్త అంబులెన్స్ లను ఏర్పాటు చేయాలని కోరారు. క్రిటికల్ కేర్ యూనిట్ ను 100 పడకల ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని కోరారు. జడ్చర్ల కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రిలో అదనపు పడకలను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ విషయంగా వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రిని దామోదర్ రాజనర్సింహ ను కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ జడ్చర్లలో వైద్య సదుపాయాలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇతర శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీహరి లతో పాటు రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ టి జి ఎం ఐ డి సి ఎండి హేమంత్, ఉమ్మడి జిల్లా డి ఎం హెచ్ ఓ లు, డిజిహెచ్ లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోరాటానికి స్ఫూర్తి చేగువేరా



- సమాజంలోని అసమానతలపై యువత పోరాడాలి
- జిల్లా కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్

**నాగర్ కర్నూల్, జనవరి 17 (మనం న్యూస్) :** చేగువేరా స్ఫూర్తితో సమాజంలోని అసమానతలపై యువత పోరాడాలని జిల్లా కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ అన్నారు. చేగువేరా వాలంటరీ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండరును శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యం చేరే దిశగా యువత అడుగులు వేయాలన్నారు. చేగువేరా సొసైటీ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. చేగువేరా వాలంటరీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కొన్నాగుల పరమేష్, అజ్జపాగ సుభాష్ మాట్లాడుతూ చేగువేరా స్ఫూర్తితో చేగువేరా వాలంటరీ సొసైటీ ఏర్పాటు చేసుకుని పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. కేరళ వరద బాధితులకు ఆర్థిక సహాయం చేశామని, ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేగువేరా వాలంటీ సొసైటీ సభ్యులు ఎన్.భాస్కర్, మధు, శ్రీను, రవి, సురేష్, జగదీష్, నాగరాజు, ఎం.శివ, హనుమంతు, శివ, కృష్ణ, నాగేంద్రబాబు, మల్లేష్ పాల్గొన్నారు.

# అధికారులు తయారు చేసిన జాబితాలు ఫైనల్ కాదు

- వాటిలో పేర్లు లేవని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- అర్హులైన వారి పేర్లు గ్రామ సభల్లో చేర్చుతాం
- గ్రామ సభల్లో ఆమోదం పొందిన తర్వాతనే తుది జాబితాలు సిద్ధం చేస్తాం
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, జనవరి 17 (మనం న్యూస్) :** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించి అధికారులు ప్రస్తుతం చూపుతున్న జాబితాలు ఫైనల్ కాదని శుక్రవారం ఒక ప్రకటనలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ సభల్లో అవసరమైన పేర్లను వాటిలో చేర్చి గ్రామ సభల ఆమోదం పొందిన తర్వాతనే తుది జాబితాలు తయారవుతా యని తెలిపారు. ఈ లోగా అధికారులు తయారు చేసిన జాబితాల్లో తమ పేర్లు లేవని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలలో అనర్హుల పేర్లు, అర్హుల పేర్లు కనిపించడం లేదని పలు ప్రాంతాల నుంచి తన దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అధికారులు తయారుచేసిన జాబితాలో కొన్నిచోట్ల ఒకే రాజకీయ వర్గానికి చెందిన వారి పేర్లు కూడా ఉన్నాయని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ప్రస్తుతం అధికారులు తయారుచేసిన ఈ జాబితా ఫైనల్ కాదని ఈనెల 21 నుంచి 25 వరకు జరగనున్న గ్రామసభల్లో లబ్ధిదారుల తుది జాబితాలు తయారవుతాయని తెలిపారు. గ్రామ సభలలో అధికారులు తయారుచేసిన జాబితాలను సమీక్షించి వాటిలో నుండి అనర్హుల పేర్లను తొలగించి అర్హులైన వారి పేర్లను జాబితాలో చేర్చడం జరుగుతుందని వివరించారు. ఈ విధంగా గ్రామ సభల్లో సమీక్షించి ఆమోదించిన జాబితాలు మాత్రమే ఫైనల్ అని అందరు గుర్తించాలని కోరారు. అధికారులు తయారు చేసిన జాబితాలలో తమ పేర్లు లేవని ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇతర పథకాలు అందేలా అర్హులైన వారందరి పేర్లు జాబితాలలో ఉండేలా చూసే బాధ్యత తనదేనని తెలిపారు. జిల్లా ఇంఛార్జి మంత్రి, ఎమ్మెల్యే



లు కలిసి జాబితాలను చూసిన తర్వాతనే వాటిని ఆమోదించడం జరుగుతుందని వెల్లడించారు. అయితే అధికారులు ఎవరైనా తాము తయారు చేసిన జాబితా లు ఫైనల్ అనే తప్పుడు సంకేతాలు ఇస్తే అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా ఎంపిక కాని వారు ఎవరైనా ఉంటే అలాంటి వారు జడ్చర్ల లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే అలాంటి వాటిని సరిదిద్దేలా చూస్తామని, నిజమైన అర్హులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఆర్థిక స్వావలంబనకు చేయూత

- పాడి పశువుల కొనుగోలుకు స్త్రీనిది రుణాలు
- స్త్రీనిధి మేనేజర్ విక్రమ్ కుమార్



**నాగర్ కర్నూల్, జనవరి 17 (మనం న్యూస్) :** స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రుణాలు అందించి వారి ఆర్థిక స్వావలంబనకు చేయూతనిస్తున్నట్లు స్త్రీ నిధి మేనేజర్ విక్రమ్ కుమార్ తెలిపారు. పాడి అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మహిళా శక్తి కార్యక్రమంలో నిర్దేశించిన విధంగా పాడి పశువుల కోసం ప్రత్యేక రుణాలు అందించేందుకు నిర్ణయించినట్లు స్త్రీ నిధి మేనేజర్ పి.విక్రమ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని వట్టెం, గుడ్లనర్వ గ్రామాల్లో శుక్రవారం స్త్రీ నిధి రుణం ద్వారా కొనుగోలు చేసిన పాడి పశువులకు ఇన్సూరెన్స్ ట్యాగింగ్ పూర్తి చేశారు. అనంతరం సంఘ సభ్యులు, లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల కోసం 93,270 రూపాయల రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ రుణాన్ని 48 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. పశువులను తప్పనిసరిగా ఇతర రాష్ట్రాల్లోనే కొనుగోలు చేయాలన్నారు. అనుకోని ప్రమాదాలు ఏర్పడి పశువు మరణిస్తే లబ్ధిదారులు నష్టపోకుండా బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. నాటుకోళ్ల పెంపకానికి కూడా రుణం అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బిజినేపల్లి మండల మహిళా సమాఖ్య కార్యదర్శి మాధవి, వివోఏలు కవిత, స్వాతి, సంఘ సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

# భారత్ పెట్టుబడులకు స్వర్గధామం: మోదీ

- **భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.**

ఢిల్లీ,జనవరి 17: భారతదేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించు కోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడి దారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రారంభించారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు.



5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యామైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపక పోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు.

పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.

దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్ మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# మెట్రో రైళ్లలో విద్యార్థులకు 50 శాతం రాయితీ

- **ప్రధానికి కేజ్రీవాల్ లేఖ**

ఢిల్లీ,జనవరి 17: అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న కొద్దీ ఢిల్లీలోని పార్టీలన్నీ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. అలాగే ఓటర్లను ఆకట్టుకునేలా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో



ప్రధాని మోదీకి ఆప్ అధినేత, ఢిలీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. దేశ రాజధాని పరిధిలోని మెట్రో రైళ్లలో ప్రయాణించే పాఠశాల, కళాశాల విద్యార్థులకు 50 శాతం టికెట్ రాయితీని అమలుచేయాలని కోరారు. రాయితీ కారణంగా పడే భారాన్ని రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో భరించాలని ప్రతిపాదన చేశారు. ''ఢిలీ విద్యార్థులకు సంబంధించి ముఖ్యమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ లేఖ రాస్తున్నాను. విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులు మెట్రోపై ఆధారపడుతున్నారు. వారిపై ఆర్థికభారాన్ని దించేందుకు 50 శాతం రాయితీ అందించాలని ప్రతిపాదిస్తున్నాను'' అని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు.

# సైఫ్ దాడి.. అండర్‌వరల్డ్ హస్తం ఉందా?

పుణె, జనవరి 17:బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దుండగుడి దాడి ఘటనతో ముంబయి నగరం మరోసారి ఉలిక్కిపడింది. గతంలో ప్రముఖులపై మాఫియా గ్యాంగ్‌లు దాడులకు పాల్పడిన ఘటనలను గుర్తుచేసింది. అయితే, సైఫ్ దాడి వెనుక చోరీ ఉద్దేశం మాత్రమే కనిపిస్తోందని మహారాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. దీనిలో క్రిమినల్ గ్యాంగుల ప్రమేయాన్ని తోసిపుచ్చారు.

''సైఫ్‌పై దాడి చేసినట్లుగా భావించి ఓ అనుమానితుడి ముంబయి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీలో కనిపించిన వ్యక్తి ముఖానికి దగ్గర పోలికలు ఉన్న ఈ యువకుడికి నేర చరిత్ర ఉంది. అయితే, ఈ ఘటనతో అతడికి సంబంధం లేదని గుర్తించాం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది'' అని మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ పుణెలో విలేకరులతో పేర్కొన్నారు. మరో



వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారని చెప్పారు.

దాడిలో ఘటనలో క్రిమినల్ గ్యాంగుల ప్రమేయంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. అటువంటి కోణం లేదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని మంత్రి పేర్కొన్నారు. కేవలం చోరీ కోసమే నిందితుడు వచ్చినట్లు ఇప్పటివరకు తెలిసిందన్నారు. ఏదైనా బెదిరింపు వచ్చినట్లు సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని, సెక్యూరిటీని కూడా కోరలేదని చెప్పారు. ఒకవేళ భద్రతను కోరితే నిబంధనల ప్రకారం కల్పిస్తామన్నారు.

కోలుకుంటున్న నటుడు..

సైఫ్ శరీరం నుంచి పదునైన వస్తువును బయటకు తీసినట్లు లీలావతి ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన వెన్నెముకకు ఎటువంటి ప్రమాదం లేదన్నారు. ఐసీయూ నుంచి ప్రత్యేక రూమ్‌కు తరలిస్తామని.. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని చెప్పారు. మరో రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్నారు.

# రష్యా తరఫున పోరాడుతున్న భారతీయులు మిస్సింగ్

ఢిలీ,జనవరి 17: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతున్న 16 మంది భారతీయులు కనిపించకుండా పోయినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. అలాగే ఇప్పటి వరకు 12 మంది మృతిచెందినట్లు తెలిపారు.

''రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో మాస్కో తరఫున 126 మంది భారతీయులు పాల్గొన్నట్లు సమాచారం ఉంది. అందులో 96 మంది సైన్యం నుంచి బయటకు వచ్చారు. కొందరు స్వదేశానికి తిరిగివచ్చారు. మరికొందరు రష్యా దళాలతో పనిచేయడం లేదు. ఇక 18 మంది ఇంకా సైన్యంలోనే పనిచేస్తున్నారు. వారిలో 16 మంది ఆచూకీ లేదు. రష్యా వారిని మిస్సింగ్ కేటగిరీలో చేర్చింది. అలాగే ఇప్పటివరకు యుద్ధంలో పోరాడుతూ 12 మంది మరణించారు'' అని జైస్వాల్ వెల్లడించారు. మిగిలిన వారిని త్వరగా స్వదేశానికి రప్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు''

''రష్యా తరఫున యుద్ధంలో పాల్గొంటూ కేరళ వాసి టీబీ బినిల్ మృతి చెందాడు. అతడి సమీప బంధువుకు గాయాలయ్యాయి. దీనికి విదేశాంగ



శాఖ తీవ్రంగా పరిగణించింది. ''ఈ విషయాన్ని మాస్కోలోని రష్యన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఢిల్లీలోని రష్యన్ రాయబార కార్యాలయం అధికారులతోనూ మాట్లాడాం. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా మిగిలిన భారతీయులను అక్కడి నుంచి పంపించాలని డిమాండ్ చేశాం'' అని ఇటీవల ప్రకటన విడుదల చేసింది. తాజాగా ఈ మృతి ఘటనపై స్పందిస్తూ.. అతడి మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు రష్యా అధికారులతో మాట్లాడుతున్నామని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

# మద్దతు ధర కోసం మళ్లీ




- **'ఢిల్లీ చలో' పునఃప్రారంభం**
- **21న పాదయాత్ర మొదలు**
- **52వ రోజుకు చేరిన దల్లేవాల్ నిరాహార దీక్ష**

చండీగఢ్ : పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న హర్యానా, పంజాబ్ సరిహద్దులోని శంభు ప్రాంతం నుంచి 101 మంది రైతుల బృందం 'ఢిల్లీ చలో' పాదయాత్ర పునఃప్రారంభిస్తున్నట్లు రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంఢేర్ తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు నాయకుడు డల్లేవాల్ చేస్తున్న నిరాహార దీక్ష గురువారం 52వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సర్వన్ సింగ్ శంభు ప్రాంతంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత 11 నెలలుగా రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రెండు ప్రధాన రైతు సంఘాలైన ఎస్కేఎం, కేఎంఎంలు మరోసారి పాదయాత్ర ప్రారంభించాలని నిర్ణయించాయన్నారు. కాగా.. గత డిసెంబరు నెలలో మూడుసార్లు పాదయాత్రగా ఢిల్లీ వెళ్లడానికి ప్రయత్నించగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఇప్పుడు మరోసారి పాదయాత్రకు రైతు బృందం సిదం కావడం గమనార్హం.

# ఇమ్రాన్‌ఖాన్‌కు మరో 14 ఏళ్ల జైలు

ఢిల్లీ,జనవరి 17: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు.



ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా.. ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు.

ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా.. ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్ హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం. దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు.

ఆగస్టు 2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనపై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల తనపై ఉన్న జైలు శిక్ష సస్పెండ్ కావడంతో బుష్రా బీబీ ప్రస్తుతం బయటే ఉన్నారు. అయితే తాజా తీర్పు సందర్భంగా ఆమె కోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది.

# దక్షిణ కొరియా విమాన ప్రమాద ఘటన.. ఇంజిన్లో పక్షి ఈకలు!

సియోల్, జనవరి 17: దక్షిణ కొరియాలో ఇటీవల విమానం డిసెంబర్ 29న ల్యాండ్ అవుతూ రక్షణ గోడను ఢీకొట్టిన ప్రమాదంలో 179 మంది మృతి చెందారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలపై పలు ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటన జరగడానికి నాలుగు నిమిషాల ముందు బ్లాక్‌బాక్స్ పని చేయకపోవడం పలు అనుమానాలకు దారితీసింది. దీంతో అసలు కారణం ఏమిటనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈక్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది.

దర్యాప్తు సమయంలో ఆ విమానం రెండు ఇంజిన్లలో పక్షి ఈకలు, రక్తం ఉన్నట్లు అధికారిక వర్గాలు గుర్తించాయి. విమానం పక్షిని ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందా అనే ప్రశ్నలు పునరావృతమవుతున్నాయి. కాగా, ఈ వార్తలపై దక్షిణ కొరియా రవాణా మంత్రిత్వశాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు.

డిసెంబర్ 29న ముయాన్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టింది. దీంతో భారీగా మంటలు చెలరేగి విమానం పేలిపోయింది. బ్యాంకాక్ నుంచి ముయాన్‌కు వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం రన్‌వేపై అత్యవసరంగా దిగే సమయంలో ల్యాండింగ్ గేర్ పని చేయకపోవడంతో అది బాడీ పైనే బెల్లీ ల్యాండింగ్ చేసిందని అధికారులు పేర్కొన్నారు. అప్పటికే ఒక ఇంజిన్‌ను పక్షి ఢీకొనడంతో దానిలో శక్తి కూడా గణనీయంగా తగ్గిందని.. అందువల్లే ల్యాండ్ అయ్యాక నియంత్రణ



కోల్పోయి ముందుకు దూసుకెళ్లి కాంక్రీట్ గోడను ఢీకొట్టిందని తెలిపారు.

దర్యాప్తులో అధికారులు యాంత్రిక, ప్రొసీజర్ సమస్యలను గుర్తించినట్లు ది టైమ్స్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా ఎయిర్ క్రాఫ్ట్ థ్రస్ట్ రివర్సర్స్, ఫ్లాప్స్, స్పీడ్‌బ్రేక్స్ వంటివి పూర్తిస్థాయిలో పని చేయలేదని చెబుతున్నారు. మరోవైపు ఏవియేషన్ నిపుణుడు జెఫ్రీ థాంప్సన్ మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధంగా లేకుండానే విమానం నేల పైకి దిగడానికి అనుమతించినట్లుందన్నారు.

# క్రిప్టో కరెన్సీకి జాతీయస్థాయి ప్రాధాన్యం.. ట్రంప్ యోచన!

వాషింగ్టన్, జనవరి 17: అమెరికా తదుపరి అధ్యక్షుడిగా డొనాల్ ట్రంప్ విజయం సాధించడంతో క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ జోరు మీదుంది. క్రిప్టో కరెన్సీకి అనుకూలంగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు ఉండొచ్చన్న అంచనాలతో దీని విలువ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఈ క్రమంలో అమెరికా జాతీయ ప్రాధాన్యత అంశంగా క్రిప్టో కరెన్సీని మార్చేదిశగా ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రిప్టోపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ కథనం పేర్కొంది. అలాగే క్రిప్టో రంగానికి సంబంధించిన విధివిధానాల నిమిత్తం క్రిప్టో కరెన్సీ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది.



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి, రెండోసారి విజయం సాధించిన డొనాల్ ట్రంప్‌నకు క్రిప్టో పరిశ్రమ నుంచి భారీ మద్దతు లభించింది. ఆయన పదవీ స్వీకార సమయంలో వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాల నిర్వహణ నిధికి ఆ సంస్థల నుంచి నిధులు అందాయి. అలాగే కొత్త ప్రభుత్వంతో సంబంధాలను చాటుకునేలా వాషింగ్టన్‌లో 'ఇనాగరల్ క్రిప్టో బాల్' పేరిట శుక్రవారం ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి.

ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో క్రిప్టో రంగం తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది. అయితే ట్రంప్ తీసుకువస్తారని భావిస్తోన్న ఉత్తర్వుల్లో.. అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు డిజిటల్ ఆస్తులకు సంబంధించిన తమ విధానాలను సమీక్షించుకునేలా ఆదేశాలు ఉండొచ్చని ఆ కథనం పేర్కొంది. అలాగే ఆ సంస్థలపై కొనసాగుతోన్న వ్యాజ్యాలను నిలిపివేయడంపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ చర్యలు గనక అమలైతే ట్రంప్ హయాంలో క్రిప్టో రంగం దూసుకెళ్లనుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే.. ట్రంప్ సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ క్రిప్టో కరెన్సీకి మస్క్ మద్దతు ఇస్తుంటారన్న సంగతి తెలిసిందే.

# ఇజ్రాయెల్, హమాస్ల మధ్య కుదిరిన సయోధ్య!

జెరుసలాం, జనవరి 17: అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ల మధ్య సయోధ్య కుదిరింది. బందీలను విడుదల చేయడానికి ఇరువర్గాల మధ్య ఒప్పందం చివరిదశకు చేరుకుందని ఇజ్రాయెల్



ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈమేరకు ఇజ్రాయెల్ మీడియాలో వార్తలు వచ్చాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి అడ్డుగా మారిన చిక్కులను మధ్యవర్తులు తొలగించినట్లు పేర్కొంది.

అలాగే కేబినెట్ సమావేశం అనంతరం ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం సమావేశమవుతుంది. కేబినెట్ ఈ ఒప్పందాన్ని ఆమోదిస్తే.. ఆదివారం నుంచి ఇది అమలుకావొచ్చని తెలుస్తోంది. బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయెల్ పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టనుంది. తర్వాత పూర్తిస్థాయిలో యుద్ధాన్ని ముగించేందుకు నిబంధనలు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఒప్పందం విషయమై ఇప్పటికే బందీల కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. హమాస్ అగ్రనేత ఇస్మాయెల్ హనియా, అక్టోబర్ 7 నాటి ఘటనకు సూత్రధారి యహ్యాసిన్‌వార్‌తోపాటు కీలక నేతలను హత మార్చింది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 46,000 మందికిపైగానే పాలస్తానీయులు మృతి చెందారు.

# బీజాపూర్లో కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

- **నారాయణపూర్‌లో ఐఈడీ పేల్చిన నక్సల్స్**

నారాయణపూర్, జనవరి 17: ఛతీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్స్ ఐఈడీ పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఛతీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపుర్ జిల్లాలో గురువారం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరోవైపు శుక్రవారం కూడా ఇక్కడ ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.



దక్షిణ బస్తర్ అడవుల్లో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో బీజాపుర్, సుక్మా, దంతెవాడ జిల్లాల నుంచి డీఆర్జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), కోబ్రా 204, 205, 206, 208, 210, సీఆర్పీఎఫ్ 229 బెటాలియన్లకు చెందిన సుమారు 1,500 మంది వరకు జవాన్లు గురువారం దండకారణ్యంలో కూంబింగ్ చేపట్టారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ ఎదురుకాల్పులు జరగ్గా 17 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనా ప్రాంతం నుంచి ఒక ఎస్ఎల్ఆర్‌తోపాటు పెద్దఎత్తున ఆయుధ సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎదురు కాల్పులు జరుగుతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. పూర్తి వివరాలను ఆపరేషన్ తర్వాత వెల్లడిస్తామని ఐజి సుందర్ రాజ్ తెలిపారు.

# అంగరంగ వైభవంగా జరిగిన స్వర్ణగిరీషుడి నిత్య కళ్యాణం

- సకలైశ్వర్య ప్రధాయిని పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన సేవ...



**భువనగిరి, జనవరి 17(మనం న్యూస్):** చతుర్దశ భువనాధీశుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని స్వర్ణాభరణాలతో, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వర్ణగిరి క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తూ దివ్యానుభూతిని పొందారు. ప్రతిరోజు స్వర్ణగిరిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా శుక్రవారం సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 నిమిషాలకు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో ఊరేగిస్తూ వేద మంత్రోచ్చారణలతో, భక్తుల గోవింద నామస్మరణలతో శ్రీ స్వామివారికి భక్తి గీతాలాపనలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్యశ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి మహా మంగళహారతులు సమర్పించారు. భక్తులు శ్రీవారినీ నయనానందకరంగా దర్శించి ఆనంద పరవశులైనారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకలైశ్వర్య ప్రధాయిని అయిన శ్రీ పద్మావతి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో, విశేష కుంకుమార్చన సేవ చేయడం జరిగింది. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

# ఏసీబీ అధికారుల వలలో చిక్కిన రెవెన్యూ చేప

- లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన డిండి ఆర్ ఐ శ్యాం నాయక్
- రెండోసారి అవినీతికి పాల్పడ్డ ఆర్ఐ శ్యాం నాయక్



**డిండి, జనవరి 17(మనం న్యూస్):** డిండి తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ గా విధులు నిర్వహిస్తున్న శ్యామ్ నాయక్ రంగారెడ్డి జిల్లా హస్తినాపురం ఊర్మిళా నగర్ లో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఆర్ఐ శ్యాం నాయక్ ఏసీబీ అధికారులకు పట్టు పడడంతో ఆయన ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళితే డిండి మండలం పడమటి తండా కు చెందిన పాండు నాయక్ కూతురుకు గత రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు కళ్యాణ లక్ష్మి కోసం డిండి తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ శ్యాం నాయక్ ఇచ్చారు కళ్యాణ లక్ష్మి ఫైల్ పై సంతకం పెడితే పదివేల రూపాయలు ఇవ్వాలని బాధితుని డిమాండ్ చేశారు బాధితుడు సార్ మేము ఆటో నడిపి బ్రతికే వాళ్ళము మా దగ్గర అంత డబ్బు లేదు సార్ అని పలుమార్లు అధికారిని వేడుకున్న కనికరం చూపని ఆర్ఐ శ్యామ్ నాయక్ అలాగే సార్ 10 వేల రూపాయలు ఇవ్వలేను కానీ 5000 వేల రూపాయలు ఇస్తానని చెప్పి 5000 వేల రూపాయలు ఇచ్చారు 5000 వేల రూపాయల కోసం మళ్లీ బాధితుని అడగడంతో ఆయన ఏమి చేయలేక ఏసీబీ అధికారులను సాంప్రదించారు శుక్రవారం ఆయన నివాసం ఉంటున్నటువంటి హస్తినాపురం ఊర్మిళ నగర్ లో 5000 వేల రూపాయలు ఆర్ఐ శ్యాం నాయక్ కు బాధితుడు ఇస్తుండగా ఏసీబీ అధికారులకు పట్టుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చినటువంటి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లాంటి ఎన్నో పథకాలు పెట్టారు ఆడపిల్ల పెళ్లి చేస్తే ఎన్నో లక్షలు అవుతుండడం వల్ల ఆ కుటుంబాలకు ఏదో ఒక రకంగా సహాయం చేయాలన్న దృఢ సంకల్పంతో కళ్యాణ లక్ష్మి అని తెచ్చి నిరుపేద కుటుంబాలకు ఎంతో బాసటగా నిలుస్తున్న ప్రభుత్వాలు, ప్రభుత్వం తెచ్చిన పథకాలకే ప్రభుత్వ అధికారులు సంతకం పెట్టకుండా కాలయాపన చేస్తూ వారిపై దౌర్జన్యంగా మాట్లాడుతూ నాకు లంచం ఇస్తేనే మీ పని అవుతుంది అనే విధంగా అధికారులు పాల్పడుతు న్నారు అలాంటి అధికారులపై చర్యలు తీసుకొని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తీసివేస్తే ఇంకో అధికారి ఇలాంటి అవినీతికి పాల్పడకుండా ఉంటారు లక్షల జీతాలు తీసుకుంటూ మళ్లీ అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలి ఇలాంటి అవినీతిపరుల భరతం పట్టడానికి ఏసీబీ అధికారు లు ఎప్పటికప్పుడు నిగా ఉంచి వారిపై చర్యలు తీసుకోవాలి ప్రజలకు ప్రభుత్వాలకు బాసటగా నిలవాల్సిన అధికారులే అవినీతికి పాలు పడితే నిరుపేద కుటుంబాల బ్రతుకులు ఏం కావాలి రాష్ట్రంలో ఎక్కడ చూసినా తాసిల్దార్ కార్యాలయంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారింది.

# గంజాయి నివారణలో సూర్యాపేట జిల్లా పోలీసులు విశేష కృషి

- కోర్టు ఉత్తర్వుల ప్రకారం,జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం
- పర్యావరణ రక్షణ,ప్రజాఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్తలు
- సీజ్ చేసిన 483 కేజీల గంజాయి
- మఠంపల్లి మండలంలో నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ లో కిల్లన్ అనే అత్యాధునిక సాధనంతో నిర్వీర్యం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్





**హుజూర్ నగర్, జనవరి 17,(మనం న్యూస్):** గంజాయి డ్రగ్స్ నివారణలో సూర్యాపేట జిల్లా పోలీసులు విశేష కృషి చేస్తున్నారని సూర్యాపేట జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్,జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ అన్నారు.సూర్యాపేట జిల్లాలో 44 కేసుల్లో స్వాధీనం చేసుకున్న కోటి 20 లక్షల విలువగల 483 కేజీల గంజాయిని శుక్రవారం హుజూర్ నగర్ నియోజక వర్గంలోని మఠంపల్లి మండలంలో మట్టపల్లి గ్రామంలో నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీలో కోర్టు ఉత్తర్వు ల మేరకు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో ఫ్యాక్టరీ యాజమాన్యం,సిబ్బంది సహాయంతో ప్రభుత్వ సాక్షుల సమక్షంలో ఫ్యాక్టరీకి చెందిన కిల్లన్ అనే అత్యాధునిక సాదనంతో గంజాయిని నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. ఔఈ ప్రక్రియకు పూర్తిస్థాయి భద్రత,రక్షణ చర్యలు తీసుకుని నిబంధన లు పాటిస్తూ పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హని కలగకుండా జాగ్రత్తలు తీసుకు న్నామని,అత్యంత భద్రత గల ప్రదేశంఅయినందున ఇతరులను అనుమతించలేద న్నారు.ప్రజల ఆరోగ్యానికి, సామాజిక భద్రతకు భంగం కలగవద్దనే ఉద్దేశ్యంతో గంజాయిని నిర్వీర్యం చేశామని తెలిపారు.ఈ గంజాయిని జిల్లాలో గత సంవత్సర కాలంలో జిల్లాలో 15 పోలీస్ స్టేషన్ ల పరిధిలో 44 కేసుల్లో సీజ్ చేశామని తెలిపారు.గంజాయి నివారణలో జిల్లా పోలీసులు కృషిచేస్తు న్నారని,డ్రగ్స్ అమ్మకం రవాణా వినియోగంకు సంభందించి డయల్ 100 కుసమాచారం ఇవ్వాలన్నారు.డగ్స్,గంజాయి వియోగించేవారిని, వ్యాపారం చేసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నామ ని తెలిపారు.తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను గమని స్తూ చెడు వ్యసనాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు సూర్యాపేట డిఎస్పి రవి,కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి,డిసిఆర్బి డిఎస్పి మట్టయ్య, హుజూర్ నగర్ సిఐ చరమందరాజు,ఎస్ఐ యాకూబ్, పంచాయితీ సెక్రెటరీ లు సలీం,స్వామి, ఫ్యాక్టరీ సిబ్బంది,తదితరులు, పాల్గొన్నారు.

## మనం కథనానికి స్పందన

**గరిడేపల్లి,జనవరి17 మనం న్యూస్:** మండలంలో రేషన్ కార్డులు అప్లికేషన్ స్వీకరణ పై గందరగోళం అనే పేరుతో గురువారం మనం పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.పేద ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డుల వెరిఫికేషన్ కు ఇన్కమ్ సర్టిఫికెట్ ప్రామాణికం కాదని శుక్రవారం అధికారులు స్పష్టం చేశారు.లిస్టులో పేరు ఉన్న లబ్ధిదారులు ఎవరు ఇన్కమ్ సర్టిఫికెట్ తేవాల్సిన అవసరం లేదని,మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో 21 తారీకు నుంచి 4 రోజులపాటు జరిగే గ్రామసభలో అర్హులను గుర్తించి రేషన్ కార్డుల జాబితాను జనవరి 26 తారీకు ప్రకటిస్తామని ఎంపీడీవో సరోజ స్పష్టం చేశారు.లిస్టులో పేరు రాని అర్హత ఉన్న లబ్ధిదారుల అప్లికేషన్లపై ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.



గరిడేపల్లి మండలంలో రేషన్ కార్డుల అప్లికేషన్ల స్వీకరణలో గందరగోళం

- పెట్టిన అప్లికేషన్లలో సగం కూడా లిస్ట్ లో రాని వైనం
- అడిగితే తమకు తెలియదు అంటున్న కార్యదర్శులు
- పట్టించుకోని మండల స్థాయి అధికారులు

## పంచాయతీ కార్యదర్శి పై గుర్తు తెలియని దుండగులు దాడి



**మోటకొండూర్, జనవరి 17(మనంన్యూస్):** మోటకొండూరు మండలం చాడ గ్రామం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పై దాడి చేశారు. డ్యూటీ కి వస్తున్న ఓ పంచాయతీ కార్యదర్శి పై గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన ఘటన యాదాద్రి జిల్లాలో జరిగింది. ఆలేరు మండలం సారాది పేటకు చెందిన రాజశేఖర్ మోటకొండూరు మండలం చాడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం గ్రామానికి విధి నిమిత్తం గ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని ఓ ఐదుగురు దుండగులు ద్విచక్ర వాహనాన్ని ఆపి దాడికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. గాయాలైన క్షతగాత్రుడిని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# కొత్త రేషన్ కార్డుల కొరకు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- అర్హులకు రేషన్ కార్డులు వచ్చేటట్లు చేయాలి
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్



**నల్లగొండ,జనవరి 17 (మనం ప్రతినిధి):** కొత్త రేషన్ కార్డుల జారీకే నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి నల్గొండ జిల్లా స్పెషల్ ఆఫీసర్ అనిత రామచంద్రన్ అన్నారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను తనిఖీ చేశారు.సర్వే బృందం చేస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ రేషన్ కార్డులకై వచ్చిన దరఖాస్తులను, జాబితాను పరిశీలించి అర్హులను మాత్రమే రేషన్ కార్డులకు ఎంపిక చేయాలని అన్నారు. అర్హత ఉన్న పేర్లను అక్కడికక్కడే నిర్ధారించాలని ఆమె సూచించారు. రేషన్ కార్డుల సర్వే సందర్భంగా పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారించాలని చెప్పారు. అనంతరం ఆమె అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం, గుడ్లు , ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక అంగన్వాడి కేంద్రం రిజిస్టర్లు అన్నింటిని తనిఖీ చేసి ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నారని, చిన్నపిల్లలు ఎంతమంది ఉన్నారని అడిగారు. పిల్లల బరువు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, తక్కువ బరువు ఉన్న పిల్లల వివరాలను తప్పకుండా నమోదు చేయాలని, పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని అంగన్వాడీ కేంద్రం టీచర్ ,ఆయాలకు సూచించారు. తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో జిల్లాకు సంబంధించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు , ఇందిరమ్మఇండ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మ పాల్గొన్నారు.

# సోమేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**తిరుమలగిరి, జనవరి 17(మనం న్యూస్):** తిరుమలగిరి మండల పరిధిలో బండ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బర్ల సోమేశ్ కుటుంబాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం పరామర్శించారు. సోమేష్ తల్లి బర్ల శాంతమ్మ ఇటీవల మృతి చెందారు. వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వై.నరేష్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, జమ్మి, వీరేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలి
- పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు..
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**హుజూర్ నగర్,జనవరి17 (మనం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.శుక్రవారం హుజూర్ నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలంలోని పెదవీడు,చౌటపల్లి గ్రామాలలో జరుగు తున్న సర్వేను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భం గా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహర భద్రత కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికకు జరుగుతున్న సర్వేను పకడ్బందీ గా నిర్వహించాలన్నారు.ప్రతి లబ్ధిదారుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి అవసరమైన డేటాను సక్రమంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేటట్లుగా బాధ్యతగా, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అనంతరంపెదవీడు,చౌటపల్లి గ్రామాలలో రైతు భరోసా పథకంలో భాగంగా రైతులకు సంబంధించి న పట్టా భూములను, అసైన్డ్ భూములను పరిశీలిం చారు.పెదవీడు గ్రామం లోని 252,253,540 సర్వే నెంబర్లలో ఉన్న మైనింగ్ లీస్ ఏరియాను, అలాగే విశ్వంభరా సిమెంట్ ఫ్యాక్టరీ భూములను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. సర్వే నెంబర్ 252,253 లలో ఉన్న రైతులు వ్యవసాయం సాగు చేసుకుంటున్న భూములను అలాగే వ్యవసాయం చేయని భూములను పరిశీలించారు.చౌటపల్లి గ్రామం లోని సర్వేనెంబర్ 875 లావుణి పట్టా భూములను పరిశీలించారు.' సర్వేనెంబర్ 540 వ్యవసాయ, వ్యవసా యేతర భూములను కూడా పరిశీలించారు. సర్వే నెంబర్ 252, 253, 540 సర్వే నెంబర్లలో కొంత సాగు చేయని భూమిని గుర్తించారు.సాగు చేయని భూములు కూడా రైతుబంధు పొందినట్లుగా క్షేత్ర పరిశీలనలో పరిశీలించడమైనదని సర్వే పూర్తి అయిన తదుపరి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు, మఠంపల్లి తహశీల్దార్ మంగ,డిప్యూటీ ల్యాండ్ సర్వేయర్ వంశీ,ఏడిఏ రవికుమార్,ఏఈఓ రమ్య, మండల సర్వేయర్ సమీర్,అధికారులు,సిబ్బంది, తదితరులు,పాల్గొన్నారు.

# తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్

- మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు
- ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్



**ఖమ్మం, జనవరి 17(మనం బ్యూరో):** విశ్వ విఖ్యాత నటసార్వభౌమ, దివంగత మాజీ సీఎం తెలుగు ప్రజల ఆరాధ్య నటులు పద్మశ్రీ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా కళ రంగం, ప్రజలకు, రాజకీయ రంగానికి ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ బిఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు ఒక ప్రకటన విడుదల చేసారు. తెలుగు చలనచిత్ర రంగానికి, ప్రజా జీవితానికి, రాజకీయ రంగానికి చేసిన కృషితో పాటు విశ్వమంతటా తెలుగు ప్రజల ప్రతిష్టను పెంచిన ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని నామ డిమాండ్ చేసారు. ఈ విషయమై 17వ లోక్ సభ లో తాను పార్లమెంట్ లో ప్రస్తావించడం జరిగిందని ఎన్టీఆర్ కు భారత రత్న ఇస్తే ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారిని గౌరవించినట్లు అవుతుందని నామ తెలిపారు. తనకు ఎన్టీఆర్ అంటే అమితమైన అభిమానం గౌరవం ఉందని నాడు ఎంపీ గా ఎన్నిక కాక ముందు నుండే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో ఎన్టీఆర్ నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యునిగా, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటులో తాను పాలుపంచుకోవడంతో పాటు, జిల్లా ప్రజల ఆశీర్వాదంతో మొదటి సారి 15వ లోక్ సభకు ఎన్నిక అయినప్పుడు నాడు పార్లమెంట్ లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చేసిన పోరాటంలో సఫలీకృతం అయ్యాను అని నామ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ హయంలో రూ.2కే కిలో బియ్యం పథకం, జనతా వస్త్రాల పంపిణీ, అన్న క్యాంటీన్లు, 5 లక్షల ఇండ్ల నిర్మాణం పథకం, పటేల్ పట్వారీ విధానం రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాలు పేదల అభిమానాన్నిచూర గొనడంతో పాటు వారికి ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసానిచ్చారని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**హన్మకొండ, జనవరి 17(మనంన్యూస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్ అండ్ బి, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ కి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. రోడ్డు సేఫ్టీకి తీసుకోనున్న ముందస్తు చర్యల వివరాలను గురించి వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఆర్అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్థి చేయాలన్నారు. కడిపికొండ ఆర్ఓబి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో గూడెప్పాడు వరకూ కొనసాగుతున్న పనులను పూర్తి చేసేందుకు ఆర్ అండ్ బీ అధికారులు కృషి చేయాలన్నారు. కటాక్షపూర్ వద్ద పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇక వడ్డేపల్లి జంక్షన్ నుండి గోకుల్ నగర్ వరకు సిగ్నల్స్ పనిచేసేవిధంగా, విద్యుత్ లైట్లు వెలిగే విధంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల శాఖ గుడిపాడు జంక్షన్ వరకు రోడ్డు పనులను పూర్తి చేయాలి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వడ్డేపల్లి చర్చి సిగ్నల్స్ పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని, విద్యుత్తు లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టండి. రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలి. బ్లాక్ స్పాట్స్ వద్ద చర్యలు చేపట్టాలని, తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాలంటీర్లు లను నియమించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ఝా మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. యువత ట్రాఫిక్ నిబంధనల ను పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించే విదంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోజురోజుకు వాహనాల వినయోగం పెరుగుతున్నందున అదేస్థాయిలో ట్రాఫిక్ పెరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా, ప్రయాణిస్తే ఎదురయ్యే ప్రమాదల పట్ల సమాజంలో అవగాహన పెరగాలన్నారు. ట్రాఫిక్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని. ట్రాఫిక్ అంశాల పట్ల యువతలో చైతన్యం రావాలన్నారు. ప్రమాదాల బారిన పడిన వారిని గోల్డెన్ అవర్ గురించి తెలియాలన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్నెస్ పై అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ శాఖ రవాణ, ఆర్టీసీ, ఆర్ అండ్ బి, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రత నియమాలకు సంబంధించి అమలు చేయడంలో అన్ని శాఖల బాధ్యత ఉంటుందని, రోడ్లకు ఇరువైపులా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మున్సిపల్ శాఖ పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కమీషనర్ అశ్వినీ తానాజీ వాఖడే, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, అదనపు డి.సి.పి సలిమా, ఆర్అండ్బి ఇఇ సురేష్, ట్రాన్స్పోర్టు, ఆర్.అండ్.బి, పోలీసు శాఖల, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రైతు ధర్నా అంటూ డ్రామా చేస్తోంది

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 17(మనంన్యూస్):** జనవరి 26 నుండి రైతు భరోసా అమలు అవుతుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. రైతులు, రైతు కూలీలకు భరోసా ఇస్తాం అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, షెడ్యూల్ ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ రైతు దీక్ష అంటూ డ్రామా చేస్తుందని మండిపడ్డారు. తాము దీక్ష చేస్తేనే.. ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చిందని చెప్పుకునే పనిలో బీఆర్ఎస్ ఉందని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా మోసాలపై 'రైతు ధర్నా' పేరుతో బీఆర్ఎస్ పోరాటం చేస్తోంది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్లో రైతు ధర్నా చేపట్టింది. బీఆర్ఎస్ రైతు ధర్నా నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించారు. 'జనవరి 26 నుండి రైతు భరోసా అమలు అవుతుంది. రైతులు, రైతు కూలీలకు భరోసా ఇస్తాం అని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ రైతు దీక్ష అంటూ డ్రామా చేస్తుంది. మేము దీక్ష చేస్తేనే ప్రభుత్వం భరోసా ఇచ్చిందని చెప్పుకునే పనిలో బీఆర్ఎస్ ఉంది. రైతులకు బోనస్ ఇచ్చింది మేము, మీరు కాదు. దేశంలో ఎక్కడా బోనస్ ఇవ్వట్లే. వరంగల్ డిక్లరేషన్లో ఇచ్చిన మాట ప్రకారమూ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. బీఆర్ఎస్ వడ్డీ మాత్రమే మాఫీ చేసింది. బీజేపీకి అసలు రుణాలు మాఫీ చేసే సంస్కృతి లేనే లేదు' అని జీవన్ రెడ్డి విమర్శించారు. 'విచారణ కేటీఆర్ మీద కొనసాగుతుంది. విచారణ ఎదుర్కొంటూ.. జడ్జి దగ్గరకు నేను వస్తా, నువ్వు వస్తావా అని అంటున్నాడు. వక్రీకరించే పనిలో కేటీఆర్ ఉన్నాడు. విచారణ ఫార్ములా ఈ రేసుపై జరుగుతుంది. ప్రజల దృష్టి మరల్చడానికి కేటీఆర్ ఈ ఎత్తుగడ వేస్తున్నాడు' అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు.

# మోడీ సర్కార్ రిమోట్ కంట్రోల్ మోహన్ భగవత్ వద్ద ఉంది

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంత రావు



**హైదరాబాద్, జనవరి 17(మనంన్యూస్):** బీజేపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వక్రికరించే పనిలో ఉందని, మోడీ సర్కార్ రిమోట్ కంట్రోల్ మోహన్ భగవత్ దగ్గర ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంత రావు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అయోధ్య కట్టిన రోజే స్వాతంత్ర్యం వచ్చింది అని అనడం సరికాదని, భగత్ సింగ్ లాంటి వాళ్ళ త్యాగాన్ని అవమానించినట్లు అని ఆయన మండిపడ్డారు. మోడీ.. సమాధానం చెప్పాలని, అమిత్ షాఅంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్నారు వీహెచ్. చరిత్ర వక్రీకరిస్తున్నారని, బీజేపీ తీరు ప్రజలకు తెలియజేయాలని, పార్టీ కార్యకర్తలు, గాంధీనీ చంపిన వారు.. ఇప్పుడు చరిత్రను వక్రీకరణ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ కి బుద్ధి చెప్పాలని, కేటీఆర్ నీకు దమ్ముంటే డిల్లీలో ప్రచారం చేసి చెప్పు అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఇక్కడ మాట్లాడితే ఏం లాభమని, రేవంత్ రెడ్డి మీద కాదు ఢిల్లీ ఎన్నికల ప్రచారం లో చెప్పు అని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ ధర్నా చేస్తే చేసుకోమని.. ఆయన రోజు ధర్నా చేయాలని, ధర్నా చౌక్ లో కూర్చుంటే ఆరోగ్యం కూడా బాగుంటుంది ఆయనకు అని ఆయన అన్నారు. ధర్నా చౌక్ ఇవాళ గుర్తుకు వచ్చింది కేటీఆర్ కి, ధర్నా చౌక్ తెచ్చింది మేము.. ధర్నా చౌక్ లో కూర్చునే అవకాశం మేమే ఇచ్చామన్నారు. మేము ఓపెన్ చేసిన ధర్నా చౌక్ లో మీరు ధర్నా చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

# ఈ నెల 20 లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- నవాబ్ పేట మండలం లో ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియ తనిఖీ



**మహబూబ్ నగర్ బ్యూరో 17 జనవరి,(మనం న్యూస్ ):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డులు,జారీకి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం పరిశీలించారు. నవాబ్ పేట మండలం పోమాల్ గ్రామం లో సర్వే బృంధం క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్న తీరును తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంభిస్తున్న విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. రైతు భరోసా కు ఏ విధంగా వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తిస్తున్నారు తెలుసుకున్నారు.డి.టి.సి.పి., ముడా లే అవుట్ లు,మైనింగ్ భూములు,సర్వే నెంబర్ వారీగా రైతుల జాబితా వివరాలతో పరిశీలించి వ్యవసాయ యోగ్యమైన,వ్యవసాయ యోగ్యం కాని భూముల ను గుర్తించి అర్హుల జాబితా రూపొందిస్తున్నట్లు అధికారులు వివరించారు రేషన్ కార్డుల జారీకి సమగ్ర కుంటుంబ సర్వే సందర్భంగా రేషన్ కార్డులు లేని వారి జాబితా ను ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హుల జాబితా రూపొందించుటకు పరిశీలన జరుపుతున్నట్లు తెలిపారు.అర్హుల జాబితా రూపొందించి ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలలో ప్రదర్శించి చదివి ఆమోదించాలని,ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిష్కరించాలని అన్నారు. త్వరితగతిన ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# ఢిల్లీలో తెలంగాణ పరువును మంటగలిపారు

- బీఆర్ఎస్ పై కడియం ఫైర్

**హైదరాబాద్, జనవరి 17(మనంన్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా గడవకముందే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబంలో అందరిమీదా కేసులు ఉన్నాయని అన్నారు. ఇప్పుడు ఎందుకు బయపడుతున్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఆర్బీఐ అనుమతులు లేకుండా డబ్బులు మళ్లించారని అన్నారు. ఒకవేళ కేటీఆర్ మీద పెట్టింది లొట్టపీసు కేసే అయితే ఏసీబీ, ఈడీ ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. ఢిల్లీలో తెలంగాణ పరువును మంటగలిపారని మండిపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసు లో కేటీఆర్ ఇచ్చి పుచ్చుకునే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. రూ.40 కోట్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం జరిగినట్టు ఆధారాలున్నాయని చెప్పారు. బాండ్ల రూపంలో కేటీఆర్కు 40 కోట్ల రూపాయలు తిరిగి వచ్చాయని కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంత జరిగినా కేటీఆర్ అహంకారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.



# టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బోజరాజు ప్రశాంత్...



**కల్వకుర్తి జనవరి17(మనం న్యూస్):** కల్వకుర్తి పట్టణానికి చెందిన న్యాయవాది బోజరాజు ప్రశాంత్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి)లీగల్ సెల్, ఆర్టిఐ డిపార్ట్మెంట్ లకు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ శుక్రవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బోజరాజు ప్రశాంత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ శ్రీ పొన్నం అశోక్ గౌడ్,ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్,లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కునూరు రంజిత్ గౌడ్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.లీగల్ సెల్ సేవలను కాంగ్రెస్ ప్రతి కార్యకర్తకు అందేలా చూస్తానని అన్నారు.గత ప్రభుత్వ హయంలో కాంగ్రెస్ కార్యకర్తలపైన నమోదైన తప్పుడు కేసుల విచారణలో న్యాయ సహాయం చేయడంలో సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. లీగల్ సెల్ సేవలను కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కునూరు రంజిత్ గౌడ్,రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ సభ్యులు అనిల్ గౌడ్,సంతోష్,నిరంజన్, వంగల కర్ణ,న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం ఆనందదాయకం.



- రుణమాఫీ సంబరాలు జరిపిన కాంగ్రెస్ శ్రేణులు.

**వాజేడు, జనవరి 17, (మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేయటం ఆనందుదాయకమని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో భాగంగా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు తప్పు పడిన లబ్ధిదారులకు రుణమాఫీ డబ్బులు జమ చేయడంతో శుక్రవారం టీజీవిబి బ్యాంకు వద్ద కాంగ్రెస్ మండల నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం హర్షినియమని పేర్కొన్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా మరో మూడు పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డుల మంజూరు చేయబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు పార్టీ నాయకులకు మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రాణమేకల రాంబాబు, తల్లడి నానబాబు, అంకిన బోయిన నరసింహారావు, చెన్నం మోహన్ రావు, చెన్నం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక



- మిర్యాలగూడ డెవలప్ మెంట్ లక్ష్యం
- ఓటేసిన ప్రజలను... పార్టీకి పనిచేసిన నేతలను కంటికి రెప్పలా కాపాడుకుందాం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ జనవరి 17 (మనం న్యూస్):** గ్రామ పెద్దలు, యువత, పార్టీ నేతలతో ఏర్పాటు చేయనున్న కమిటీల ద్వారా సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నామని... పార్టీలకతీతంగా నిజమైన అర్హులను గుర్తించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 'మన ఊరు మన ఎమ్మెల్యే' లో భాగంగా మాడుగులపల్లి మండలం పాములపాడు నుంచి కుక్కడం వరకు 13 గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపించి గొప్ప బాధ్యత ను అప్పగించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను కాపాడుకుంటూ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఓట్లు వేసిన ప్రజలను... కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేసిన నేతలను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే ఈ ప్రాంతాన్ని డెవలప్ చేస్తామని చెప్పారు. గ్రామ కమిటీలు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికతో పాటు... గ్రామాల్లో అభివృద్ధి పనుల జాబితాను రూపొందించి తనకు అందిస్తే రానున్న నాలుగేళ్లలో దశలవారీగా పనులను పూర్తి చేస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల పథకాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తోట సత్తిరెడ్డి ఉన్నారు.

# కేసీఆర్ చేసిన కృషి సత్ఫలితాలను అందించింది

హైదరాబాద్, జనవరి 17(మనంన్యూస్): తెలంగాణలో బీడుగా మారిన భూములకు కృష్ణా జలాలను మళ్లించే క్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషి సత్ఫలితాలను అందించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కవిత తన ఎక్స్ వేదికగా ట్వీట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. 'కృష్ణా జలాల్లో మా వాటా మాకే' అనే కేసీఆర్ పోరాటం విజయవంతమై, దీని ఫలితాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులపై విచారణ జరపాల్సిందిగా గత పదేళ్లుగా కేసీఆర్ చేసిన వాదనకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మొగ్గుచూపడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల విజయం, బీఆర్ఎస్ పార్టీ విజయమని ఆమె అన్నారు.



# షరతులు పెట్టొద్దు..



- భూమి లేని వ్యవసాయ కూలీలందరికీ రైతు భరోసా ఇవ్వాలి
- వ్యవసాయ కూలీల ఆకలి కేక యాత్ర ప్రారంభం

**నాగర్ కర్నూల్, జనవరి 17 (మనం న్యూస్) :** ఎలాంటి షరతులు పెట్టకుండా భూమి లేని వ్యవసాయ కూలీలందరికీ రైతు భరోసా ఇవ్వాలని బిఎంపి పార్లమెంట్ ఇంచార్జ్ గడ్డం విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడూరు మండల కేంద్రంలో శుక్రవారం బహుజన ముక్తి మోర్చా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వ్యవసాయ కూలీల ఆకలి కేక యాత్రనును ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఎంపి పార్లమెంట్ ఇంచార్జ్ గడ్డం విజయ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఇస్తున్న 12 వేలను ఉపాధి పని శరతులు పెట్టకుండా భుమి లేని వ్యవసాయ కూలీలందకీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక ఎకరం భూమి ఉండి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న పేదలందరినీ వ్యవసాయ కూలీలుగా గుర్తిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో సమానంగా 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎకరం భూమి లోపు ఉన్న వారికి గుంటల వారిగా ఇవ్వడం వలన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అందుకోలే పోతున్నారన్నా రు. ఇలాంటి సందర్భంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో పల్లె పల్లెన కూలీల చైతన్య కూలీల ఆకలి కేక యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా బీఆర్ఎస్ మండల నాయకులు గడ్డం మశన్న, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కుందేటి మహేష్, గడ్డం జగన్, మీసాల వెంకటయ్య, ఎర్రోళ్ల బాలయ్య, పోసగాళ్ళ కుర్మయ్య పాల్గొన్నారు.

# గ్రామ దేవతల అనుగ్రహాన్ని ప్రతిఒక్కరూ పాత్రులు కావాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి17(మనం న్యూస్):** గ్రామ దేవతల అనుగ్రహాన్ని ప్రతిఒక్కరూ పాత్రులు కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం కల్వకుర్తి మండలంలోని తాంద్ర గ్రామ ఈదమ్మ మాంధాత దేవతను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు అందరు పొందాలని అన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ పూజారులు,ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి,నాయకులు సురేందర్ రెడ్డి,జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్ రెడ్డి,కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



# భారత్.. మూడు ప్రాక్టీస్ మ్యాచ్‌లతో!



ఇంగ్లాండ్ తో అయిదు టెస్టు సిరీస్ కు భారత్ పకడ్బందీగా సిద్ధం కాబోతోంది. జూన్ 20న లీడ్స్ లో తొలి టెస్టు ఆరంభానికి ముందు యూకేలో ఇంగ్లాండ్ లయన్స్ తో మూడు నాలుగు రోజుల మ్యాచ్ లు ఆడనుంది. దీనికి సంబంధించిన తేదీలు ఖరారు కావాల్సి ఉంది. ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0-3తో వైట్ వాష్ కాగా.. తర్వాత బోర్డర్-గావస్కర్ టోర్నీలో ఆస్ట్రేలియా చేతిలో 1-3తో ఓడిన నేపథ్యంలో భారత ప్లేయర్లకు ఇంగ్లాండ్ తో సిరీస్ ముందు ఎర్ర బంతితో వీలైనంత ఎక్కువ సాధన అవసరమని బీసీసీఐ భావిస్తోంది. ''బోర్డర్-గావస్కర్ సిరీస్ కు ముందు ఆస్ట్రేలియాలో భారత్-ఎ జట్టు పర్యటించింది. ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ కు మొదలయ్యే సమయానికి ఇక్కడ పరిస్థితులు అలవాటు పడేందుకు టీమ్ఇండియా ప్లేయర్లకు నాలుగు రోజుల మ్యాచ్ లు ఉపయోగపడతాయి'' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఈ నెల 23న పునఃప్రారంభం కానున్న రంజీ ట్రోఫీలోనూ టీమ్ఇండియా ఆటగాళ్లు శుభ్ మన్ గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ బరిలో దిగనున్నారు.

## సచిన్ సారథ్యంలో భారత్



సచిన్ తెందుల్కర్ సారథ్యంలో భారత జట్టు మైదానంలో దిగబోతుంది. అవును.. మీరు చదివింది నిజమే. క్రికెట్ దిగ్గజం సచిన్ మరోసారి జట్టును నడిపించబోతున్నాడు. అయితే అది ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ కోసం. ఆటకు వీడ్కోలు పలికిన వివిధ దేశాల దిగ్గజ ఆటగాళ్లు ఈ లీగ్ లో ఆడబోతున్నారు. ఈ ఏడాది జరిగే ఆరంభ సీజన్ లో భారత్ తో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు బరిలో దిగబోతున్నాయి. వచ్చే నెల 22 నుంచి మార్చి 16 వరకు భారత్ లోనే తొలి సీజన్ జరగబోతోంది. నవీ ముంబయి, రాజ్ కోట్, రాయ్ పుర్ ఈ మ్యాచ్ లకు వేదికలు. ఈ సీజన్ లో తలపడే వెస్టిండీస్ కు బ్రయాన్ లారా, శ్రీలంకకు సంగక్కర, దక్షిణాఫ్రికాకు కలిస్, ఇంగ్లాండ్ కు మోర్గాన్, ఆస్ట్రేలియాకు షేన్ వాట్సన్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. ''ఆటతో అలరించిన కొంతమంది అత్యుత్తమ ఆటగాళ్లను ఒక్క చోటుకు చేర్చి, క్రికెట్ వైభవాన్ని చాటుతామని ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ హామీనిస్తోంది'' అని ఈ లీగ్ కమిషనర్ సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు.

## క్వార్టర్స్‌లో సింధు

కొత్త ఏడాదిలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు దూసుకెళ్తోంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె క్వార్టర్స్ లో అడుగుపెట్టింది. గురువారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ లో సింధు 21-15, 21-13 తేడాతో మనామి సుయిజు (జపాన్)ను చిత్తుచేసింది. మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన సింధు వరుస గేమ్ ల్లో ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి గేమ్ ఆరంభంలో దూకుడుతో సాగిన ఆమె విరామానికి 11-6తో నిలిచింది. కానీ ఆ తర్వాత పుంజుకున్న మనామి 13-14తో సింధును అందుకునేందుకు ప్రయత్నించింది. కానీ భారత షట్లర్ ఆ అవకాశం ఇవ్వలేదు.

బలమైన స్మాష్ లతో విరుచుకుపడ్డ సింధు.. తెలివిగా నెట్ దగ్గర డ్రాప్ షాట్లూ ఆడింది. చూస్తుండగానే 20-14తో ఆధిక్యాన్ని పెంచుకుంది. ఆ తర్వాత ప్రత్యర్థి షటిల్ ను నెట్ కు కొట్టడంతో గేమ్ సింధు సొంతమైంది. రెండో గేమ్ లోనూ సింధు ధాటి ముందు ప్రత్యర్థి నిలవలేకపోయింది. మరోవైపు పురుషుల సింగిల్స్



ప్రిక్వార్టర్స్ లో కిరణ్ జార్జ్ 22-20, 21-13తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకొని తొలి గేమ్ దక్కించుకున్న కిరణ్.. రెండో గేమ్ లో చెలరేగి విజేతగా నిలిచాడు. పురుషుల డబుల్స్ లో ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ జోడీ కూడా క్వార్టర్స్ చేరింది. ప్రిక్వార్టర్స్ లో ఈ భారత జంట 20-22, 21-14, 21-16తో మిత్సుహాషి-ఒకమురా (జపాన్)పై విజయం సాధించింది. తొలి గేమ్ లో పోరాడి ఓడిన సాత్విక్ ద్వయం.. ఆ తర్వాత గొప్పగా పుంజుకుని వరుసగా మిగతా రెండు గేమ్ ల్లో గెలిచింది.

## టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు

బోర్డర్- గావస్కర్ సిరీస్ లో భారత క్రికెట్ జట్టు వైఫల్యం తీవ్ర చర్చనీయాంశంగా మారిన తరుణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్ గా సితాన్షు కోటక్ ను బీసీసీఐ గురువారం నియమించింది. త్వరలో ఇంగ్లాండ్ తో పరిమిత ఓవర్ల సిరీస్, ఫిబ్రవరిలో ఛాంపియన్స్ ట్రోఫీ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. 52 ఏళ్ల సితాన్షు సుదీర్ఘ కాలంగా జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్సీఏ)లో బ్యాటింగ్ కోచ్ గా పనిచేస్తున్నాడు. గత కొన్నేళ్లలో భారత సీనియర్, 'ఎ' జట్ల పర్యటనల్లో కోచ్ గానూ బాధ్యతలు నిర్వర్తించాడు. గతేడాది ఐర్లాండ్ పర్యటనలో టీమ్ ఇండియా ప్రధాన కోచ్ గానూ వ్యవహరించాడు. ఈ సౌరాష్ట్ర మాజీ బ్యాటర్



130 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ల్లో 8 వేలకు పైగా పరుగులు సాధించాడు. ఇందులో 15 శతకాలున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు బ్యాటింగ్ లో తీవ్రంగా నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టు సహాయ కోచ్ అభిషేక్ నాయర్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. బ్యాటర్ల టెక్నిక్ వైఫల్యం పట్ల సహాయక కోచ్ లు జవాబుదారీతనంతో ఉండాలంటూ వాళ్ల పాత్రను దిగ్గజం గావస్కర్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బ్యాటింగ్ కోచ్ గా సితాన్షును ఎంపిక చేయడంతో అభిషేక్ నాయర్ భవితవ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గంభీర్ ప్రధాన కోచ్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అభిషేక్ నాయర్ (బ్యాటింగ్), డస్కాటె (ఫీల్డింగ్), మోర్నీ మోర్కెల్ (బౌలింగ్)లను తన సహాయక బృందంలో చేర్చుకున్న విషయం తెలిసిందే. ''అభిషేక్ నాయర్ అనుభవం ఆటగాళ్లకు ఉపయోగపడటం లేదన్నది స్పష్టం. సితాన్షు సుదీర్ఘ కాలంగా స్పెషలిస్ట్ బ్యాటింగ్ కోచ్ గా కొనసాగుతున్నాడు. ఆటగాళ్ల నమ్మకాన్ని పొందాడు. అతను భారత్-ఎ జట్టు బాధ్యతలు చూసుకునేవాడు. సితాన్షు లెవల్ 3 కోచ్. గతంలో వీవీఎస్ లక్ష్మణ్ కు సహాయ కోచ్ గా ఉన్నాడు. గతేడాది ఐర్లాండ్ పర్యటనలో జట్టుకు ప్రధాన కోచ్ గా వ్యవహరించాడు. అతను ఎన్సీఏ సిబ్బందిలో భాగం కాబట్టి ఎక్కడైనా నియమించొచ్చు'' అని ఓ బీసీసీఐ సీనియర్ ప్రతినిధి చెప్పాడు. ఈ నెల 22న ఇంగ్లాండ్ తో పరిమిత ఓవర్ల సిరీస్ ఆరంభమవుతుంది.

## ఖేల్‌రత్న పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి

భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో.. చెస్ ప్లేయర్ డి.గుకేశ్, హాకీ స్టార్ హర్మన్ ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, షూటింగ్ లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఈ అవార్డులు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు జివాంజీ దీప్తి (పారా అథ్లెటిక్స్), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్) పురస్కారాలను స్వీకరించారు. వీరితోపాటు మరో 32 మంది అర్జున, ఐదుగురు ద్రోణాచార్య పురస్కారాలు అందుకున్నారు. లైఫ్ టైం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్ బాల్) పురస్కారాలు స్వీకరించారు.



**అర్జున అవార్డులు అందుకుంది వీరే.. :** అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతూ (బాక్సింగ్), స్వీటీ బురా (బాక్సింగ్), వంతిక అగర్వాల్ (చెస్), సలీమా (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్ జీత్ సింగ్ (హాకీ), స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్), సరబ్జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), అమన్ (రెజ్లింగ్), రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్), ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్), అజీత్ సింగ్ (పారా అథ్లెటిక్స్), సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్), ప్రణవ్ సూర్య (పారా అథ్లెటిక్స్), హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్), సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవ్ దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్), నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్), మనీశా రాందాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జూడో), మోనా అగర్వాల్ (పారా షూటింగ్), రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్).

**అర్జున అవార్డ్స్ (లైఫ్టైమ్) :** సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్).

**ద్రోణాచార్య అవార్డులు (కోచ్ లు) :** సుభాష్ రాణా (పారా షూటింగ్), దీపాలీ దేశ్పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ)

మనం మూవీ+ manammovie

## లాస్ ఏంజెలెస్ నుంచి హైదరాబాద్‌కు ప్రియాంక చోప్రా.. SSMB29 కోసమేనా!



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ SSMB29. మహేశ్బాబు హీరోగా దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించనున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ పైకి వెళ్తుందా అని ఆసక్తిగా ఉన్నారు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన వార్తలు క్షణాల్లో వైరల్ గా మారుతున్నాయి. ఇందులో బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా నటించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. దీంతో మహేశ్- రాజమౌళి ప్రాజెక్ట్ కోసమే హైదరాబాద్ కు వచ్చారంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆమె విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ పై త్వరలోనే అధికారిక అప్డేట్ వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

ఇటీవలే చిత్రబృందం హైదరాబాద్ లో పూజా కార్యక్రమాల్ని నిర్వహించి సినిమాకి శ్రీకారం చుట్టింది. కథానేపథ్యం మినహా, ఈ సినిమాకి సంబంధించి ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని బయట పెట్టలేదు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆరట్స్ పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెండితెరపై సరికొత్త లుక్ లో మహేశ్ కనిపించనున్నారు.

## బరిలోకి ప్రభాస్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు హను రాఘవపూడి కలయికలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇమాన్వి కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే వారం నుంచి కొత్త షెడ్యూల్ ను ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. హైదరాబాద్ లో జరగనున్న ఈ షెడ్యూల్ లో ప్రభాస్ కూడా పాల్గొననున్నారని సమాచారం. దీనిలో భాగంగా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. 1940ల నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రమిది.



చారిత్రక అంశాలతో ముడిపడి ఉండే ఈ సినిమాలో ప్రభాస్ రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. దీనికి 'ఫౌజీ' అనే పేరు పరిశీలనలో ఉంది.

## చేపల పులుసు వండిన నాగచైతన్య

నాగచైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. వచ్చే నెలలో 7వ తేదీన ఇది విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ఎక్కువ భాగం చిత్రీకరణ ఉత్తరాంధ్ర ముఖ్యంగా విశాఖపట్నం, శ్రీకాకుళంలో జరిగిన విషయం తెలిసిందే. చిత్రీకరణ సమయంలో చైతన్య విశాఖపట్నంలోని స్థానికులతో మాట్లాడారు. వారి స్టైల్ లోనే చేపల పులుసు చేసి పెడతానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఓరోజు చేపల పులుసు వండి అక్కడివారికి వడ్డించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా షేర్ చేసింది.



## విజువల్‌గా కూడా ట్రీట్ ఇస్తున్న వీరమల్లు ఫస్ట్ సింగిల్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సినిమాల్లో దర్శకుడు జ్యోతి కృష్ణ అలాగే క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం హరిహర వీరమల్లు కూడా ఒకటి. అయితే చాలా కాలం తర్వాత ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ మళ్ళీ పాట పాడటం జరిగింది. మాట వినాలి అంటూ నేడు మేకర్స్ సాంగ్ ని రిలీజ్ చేశారు.

మరి ఈ సాంగ్ తో మళ్ళీ చాలా కాలం తర్వాత పవన్ మార్క్ ఫోక్ సాంగ్ తో ట్రీట్ ఇచ్చారని చెప్పాలి. కీరవాణి స్లో మ్యూజిక్ తో పవన్ కళ్యాణ్ తెలంగాణ యాసలో అదరగొట్టేశారని చెప్పాలి. అలాగే పెంచల్ దాస్ సాహిత్యంకి పవన్ మార్క్ రిథమ్ తో ఇంపుగా ఉందని చెప్పాలి. అయితే ఇందులో సాంగ్ తో పాటుగా పవన్ లుక్స్ సూపర్బ్ గా ఉన్నాయని చెప్పాలి.

దీనితో పాటుగా బ్యాక్గ్రౌండ్ విజువల్స్ కూడా సాలిడ్ నిర్మాణ విలువలతో కనిపిస్తుండడం విశేషం. ఇలా పాట గానే కాకుండా విజువల్ గా కూడా ఇంప్రెస్ చేసింది. ఇక ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించగా బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్నారు. అలాగే ఏ ఎం రత్నం నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ మార్చ్ 28న పాన్ ఇండియా లెవెల్లో ఈ చిత్రం రిలీజ్ కి రాబోతుంది.

### వీరమల్లు సినిమాపై బాబీ డియోల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సినిమాల్లో దర్శకుడు జ్యోతి కృష్ణ అలాగే క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం హరిహర వీరమల్లు కూడా ఒకటి. అయితే చాలా కాలం తర్వాత ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ మళ్ళీ పాట పాడటం జరిగింది. మాట వినాలి అంటూ నేడు మేకర్స్ సాంగ్ ని రిలీజ్ చేశారు.

మరి ఈ సాంగ్ తో మళ్ళీ చాలా కాలం తర్వాత పవన్ మార్క్ ఫోక్ సాంగ్ తో ట్రీట్ ఇచ్చారని చెప్పాలి. కీరవాణి స్లో మ్యూజిక్ తో పవన్ కళ్యాణ్ తెలంగాణ యాసలో అదరగొట్టేశారని చెప్పాలి. అలాగే పెంచల్ దాస్ సాహిత్యంకి పవన్ మార్క్ రిథమ్ తో ఇంపుగా ఉందని చెప్పాలి. అయితే ఇందులో సాంగ్ తో పాటుగా పవన్ లుక్స్ సూపర్బ్ గా ఉన్నాయని చెప్పాలి.

దీనితో పాటుగా బ్యాక్గ్రౌండ్ విజువల్స్ కూడా సాలిడ్ నిర్మాణ విలువలతో కనిపిస్తుండడం విశేషం. ఇలా పాట గానే కాకుండా విజువల్ గా కూడా ఇంప్రెస్ చేసింది. ఇక ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించగా బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్నారు. అలాగే ఏ ఎం రత్నం నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ మార్చ్ 28న పాన్ ఇండియా లెవెల్లో ఈ చిత్రం రిలీజ్ కి రాబోతుంది.

## లేడీ గెటప్‌లో విశ్వక్సేన్

ప్రేమికుల రోజున 'లైలా'గా సినీప్రియులకు గిలిగింతలు పెట్టనున్నారు నటుడు విశ్వక్ సేన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక.



చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా 'లైలా' టీజర్ విడుదల చేసింది. 'మనకు తెల్లగా చేసుడే కాదు. తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ చెప్పిన డైలాగ్ లు ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్ చివర్లో అమ్మాయి వేషధారణలో విశ్వక్ సేన్ లుక్స్, నటన సినీ ప్రియులను విశేషంగా అలరించేలా ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.